సాక్షి
కరీంనగర్

శుక్రవారం । 3 । నవంబర్ । 2023

సైకిళ్లు పాయె.. 'తెర'లొచ్చె

పాత రోజుల్లో సైకిళ్లపై రోజుకు రెండు, మూడు గ్రామాలు తిరుగుతూ ఎన్నికల ప్రాధాన్యతను వివరించి, ఓటడిగేవారు. కాలానికనుగుణంగా ప్రచారంలో మార్పులు వచ్చాయి. అభ్యర్థులు ఎల్ఈడీ స్క్రీన్లు, డీజే సౌండ్ బాక్సులు, కళాకారుల బృందాలతో ప్రచార పర్వాన్ని హోరెత్తిస్తున్నారు.

- IIలో▸



ప్రతిసారీ ఉత్కంఠ!

- కరీంనగర్ అసెంబ్లీ ఓటర్ల తీర్పు ప్రత్యేకం
- ఐదుసార్లు కాంగ్రెస్, నాలుగుసార్లు టీడీపీ గెలుపు
- ఎంపీగా జువ్వాడి, ఎమ్మెల్యేగా గంగుల హ్యాట్రిక్
- కాంగ్రెస్ కంచుకోటలో గుబాళించిన 'గులాబీ'
- అన్ని పార్టీలను ఆదరించిన ఓటర్లు




చొక్కారావు (ఫైల్)



గంగుల కమలాకర్

కరీంనగర్ అసెంబ్లీ ఓటర్లు	
పురుషులు	1,71,254
స్త్రీలు	1,70,615
ఇతరులు	44





కరీంనగర్: ఉద్యమాల పురిటిగడ్డ కరీంనగర్‌లో ఏ ఎన్నిక జరిగినా ప్రతిష్ఠాత్మకమే.. అన్ని పార్టీలకూ కీలకమే. ఇక్కడి ఓటర్లు ప్రతీ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పునిస్తూ భిన్న పార్టీలకు చెందిన ఎందరో నాయకులను ఆదరించారు. ఓసీలకు ముఖ్యంగా వెలమలకు ఒకప్పుడు కంచుకోటలా ఉండేది. ఒక్క 2018 ఎన్నికల్లో మాత్రమే ఓసీ అభ్యర్థి లేకుండా ఎన్నిక జరగడం విశేషం. ఒకే వ్యక్తికి రెండు పర్యాయాలు అవకాశమిచ్చినా.. మరో ఎన్నికల్లో వేరేవారిని ఎన్నుకున్నా.. పనితీరు బాగోలేకుంటే నిర్మొహమాటంగా వేరే అభ్యర్థిని గెలిపించుకున్నా అది కరీంనగర్ అసెంబ్లీ ప్రజానీకానికే చెల్లింది. ప్రతీ ఎన్నికల్లో విజేత ఎంపిక విషయంలో కడదాకా ఎడతెగని ఉత్కంఠను చూపిస్తూనే ఉన్నారు.

ఘన చరిత్ర..

ఉత్తర తెలంగాణకు కేంద్ర బిందువైన కరీంనగర్ నియోజకవర్గానికి ఘన చరిత్ర ఉంది. నిజాం నవాబు మెడలు వంచడంలో, రైతాంగ ఉద్యమం, తెలంగాణ తొలి, మలి దశ పోరాటాల్లో పాత్ర అనిర్వచనీయం. దొరల దాష్టీకానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల, ఉన్నవాడి నుంచి పేదోళ్లకు పంచేందుకు నక్సల్స్, జనశక్తి పార్టీలు చేసిన భూపోరాటాలు చరిత్రలో నిలిచిపోయాయి. తెలంగాణ సాయుధ సమరానికి సైరన్ మోగించిన ముగ్గురిలో ఒకరైన బద్దం ఎల్లారెడ్డి, రాజకీయ అగ్రగన్యులైన జువ్వాడి చొక్కారావు, ఎమ్మెస్సార్, చెన్నమనేని విద్యాసాగర్‌రావు, ప్రస్తుత సీఎం కేసీఆర్ లాంటి అగ్రనేతలంతా కరీంనగర్ కేంద్ర బిందువుగా ఉద్యమ వాడివేడిని రగిలించినవారే. మలిదశ పోరాటంలో 2001లో టీఆర్ఎస్ పార్టీ స్థాపించగా ఎస్సారార్ కళాశాల వేదికగా సింహగర్జన బహిరంగ సభ జరిగింది ఇక్కడే. ఇటీవల అమరుడైన ప్రజాయుద్ధ నౌక గద్దర్ సారథ్యంలో పీపుల్స్ వార్ రైతు కూలీ సంఘం భారీ బహిరంగ సభ కరీంనగర్ బస్‌స్టేషన్ ప్రాంగణ సమీపంలోనే నిర్వహించారు. ఇది రైతాంగ ఉద్యమానికి నాంది పలికింది.

1952లో నియోజకవర్గం ఏర్పాటు

కరీంనగర్ నియోజకవర్గం 1952లో ఏర్పడింది. ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. 66 ఏళ్ల క్రితం 40 వేల ఓటర్లు ఉండగా.. ప్రస్తుతం 3,41,913కు పెరిగారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత గతంలో ఉన్న తిమ్మాపూర్, మానకొండూర్ మండలాలు కొత్తగా ఏర్పడిన మానకొండూర్ నియోజకవర్గంలో కలిశాయి. దీంతో కేవలం కరీంనగర్ పట్టణం, కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాలు మాత్రమే కరీంనగర్ నియోజకవర్గంలో ఉన్నాయి.

వ్యవసాయం..
పరిశ్రమలు.. కళాశాలలు

నియోజకవర్గానికి వ్యవసాయమే కీలకం. కొత్తపల్లి మండలం, కొత్తపల్లి మున్సిపాలిటీలలో గ్రానైట్, పాలిషింగ్ పరిశ్రమలు, క్వారీలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. రైతులు పత్తి, వరి, మొక్కజొన్న సాగు చేస్తున్నారు. 3 వైద్య కళాశాలలు, మొక్కజొన్న పరిశోధన కేంద్రం, 6 ఇంజినీరింగ్ కళాశాలలు, శాతవాహన విశ్వవిద్యాలయం, రెండు నర్సింగ్ కళాశాలలు ఉన్నాయి. ఇటీవల స్మార్ట్‌సిటీ రోడ్లు, ఐటీ టవర్, కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్‌లతో నగరం పర్యాటక శోభ సంతరించుకుంది. సామాజికవర్గాల వారీగా మున్నూరు కాపు, పద్మశాలీ, గౌడ, యాదవ, ముదిరాజ్ కులాల ఓట్లు అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసేలా ఉన్నాయి.

మంత్రులుగా పని చేసిన ముగ్గురు..

ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో పేరొందిన నాయకుడు ఎం.సత్యనారాయణరావు(ఎమ్మెస్సార్). తెలంగాణ ప్రజా సమితి నుంచి 1971లో, కాంగ్రెస్(ఐ) నుంచి 1977, 1980లలో కరీంనగర్ ఎంపీగా గెలిచారు. అనూహ్యంగా 2004లో ఎమ్మెల్యేగా పోటీ చేసి, కీలక నేతగా ఎదిగారు. ఇక్కడి నుంచి గెలిచినవారిలో జువ్వాడి చొక్కారావు జలగం వెంగళరావు కేబినెట్‌లో, సి.ఆనందరావు ఎన్టీఆర్ మంత్రి వర్గంలో, ఎమ్మెస్సార్ వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రి వర్గంలో పని చేశారు. ఎమ్మెస్సార్ పీసీసీ అధ్యక్షుడిగా, ఆర్టీసీ చైర్మన్‌గా కొనసాగారు.



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

ఆశీర్వదించండి.. అండగా ఉంటా

- ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్

కరీంనగర్: అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తనను మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలుపించాలని, అండగా ఉండి అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం ఆర్యవైశ్యుల, లక్ష్మీగణపతి కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. పదేళ్లల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం గత ప్రభుత్వాల కన్నా భిన్నంగా అన్ని వర్గాల అభివృద్ధికి పనిచేసిందని అన్నారు. ఆర్యవైశ్యుల సమస్యలను గత ప్రభుత్వాలు విస్మరించాయని, తాము అధికారంలోకి వచ్చాక అన్నికులాలకు, మతాలకు సమప్రాతినిధ్యం కల్పించామని అన్నారు. మేయర్ వై.సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు కంసాల శ్రీనివాస్, ఎడ్ల అశోక్, ఆర్యవైశ్య సంఘం నాయకులు చిట్టుమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమించొద్దు

కరీంనగర్‌క్రైం: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలదృష్ట్యా, ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున జిల్లాలో విస్తృతస్థాయిలో వాహన తనిఖీలు చేపడుతున్నామని సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. ఎన్నికలు ముగిసేవరకు తనిఖీలు కొనసాగుతాయని వివరించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించి అక్రమ రవాణాకు పాల్పడినా, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నియమాలు అతిక్రమించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎల్ఎండీ పోలీసుస్టేషన్‌ను సీపీ తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం రేణికుంట టోల్‌ప్లాజా వద్ద ఉన్న చెక్‌పోస్టును తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాహన తనిఖీల్లో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏ వాహనాన్ని విడిచిపెట్టకుండా, క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అన్నారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ టి.కరుణాకర్‌రావు, తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.



రేణికుంట టోల్‌ప్లాజా వద్ద రికార్డులు పరిశీలిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

నామినేషన్లకు వేళాయే

- నేటి నుంచి 10వ తేదీ వరకు గడువు
- ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరణ

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఎన్నికల సంగ్రామానికి ప్రధాన ఘట్టం శుక్రవారం నుంచే మొదలుకానుంది. ఉదయం 10 గంటలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసిన గంట తర్వాత నామినేషన్ల పర్వం ప్రారంభం కానుంది. ఈమేరకు కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల కలెక్టర్లు ఏర్పాట్లు పూర్తిచేశారు. నియోజకవర్గాల వారీగా ఆర్వోలు నామినేషన్లు స్వీకరించనున్నారు. పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటుచేశారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అధికారులు వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు.

ఒకరి ప్రతిపాదన చాలు

జాతీయ, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో అదే నియోజకవర్గంలో ఎవరైనా ఒక ఓటరు ప్రతిపాదించాలి. అభ్యర్థి మాత్రం రాష్ట్రంలో ఏ నియోజకవర్గం నుంచైనా ఓటరై ఉండాలి. రిజిస్టర్ పార్టీ, స్వతంత్ర అభ్యర్థుల విషయంలో నిబంధన మారుతుంది. వీరు నామినేషన్ వేస్తే నియోజకవర్గానికి చెందిన పది మంది ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుంది.ప్రతిపాదించేవారు నిరక్షరాస్యులైతే ఆర్వో ఎదుట నామినేషన్ స్వీకరణ సమయానికి ముందు, తర్వాత వేలిముద్ర వేయాలి. ప్రతిపాదించే వారి సంతకాన్ని అభ్యర్థులు ఫోర్జరీ చేసినట్లు విచారణలో తేలితే నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది. కేసు కూడా నమోదు చేస్తారు.

నలుగురికి అవకాశం

కేంద్రాలకు వెళ్లడానికి అభ్యర్థితో పాటు మరో నలుగురికి అవకాశం కల్పిస్తారు. రిజిస్టర్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు వారిని ప్రతిపాదించేవారు వారి ఓటరు క్రమసంఖ్య, పోలింగ్ బూత్ నమోదు చేసుకుని సంతకం తీసుకుంటే సరిపోతుంది. సంతకాలు సరైనవో కావో అధికారులు విచారణ చేస్తారు. అభ్యర్థి ఇతర నియోజకవర్గానికి చెందిన వ్యక్తి అయితే పోలింగ్ బూత్, ఓటరు క్రమసంఖ్య వివరాలు అక్కడి ఆర్వోతో ధ్రువీకరించి అందజేయాలి. క్యాండిడేట్ వెంట మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. రిటర్నింగ్ ఆఫీస్‌కు వంద మీటర్ల దూరంలో మెహికిల్స్ నిలిపివేయాలి.

బ్యాంకు ఖాతా ఇవ్వాల్సిందే

అభ్యర్థులు బ్యాంకు ఖాతా వివరాలు ఆర్వోకు అందజేయాలి. ఏదైనా జాతీయబ్యాంకు నుంచి కొత్తగా ఖాతా తెరవాలి. ఎన్నికలు పూర్తయ్యే వరకు అదే ఖాతా నుంచి లావాదేవీలు నిర్వహించాలి. ఎమ్మెల్యేగా నామినేషన్ వేసే సాధారణ అభ్యర్థులు రూ.10 వేలు డిపాజిట్ చేయాలి. ఎస్సీ, ఎస్టీలైతే రూ.5 వేలు చెల్లిస్తే సరిపోతుంది.

ఏరోజుకారోజు వివరాలు..

ప్రతిరోజు సాయంత్రం 3 గంటల తర్వాత రోజువారీ నామినేషన్ వివరాలను ఈసీ వెల్లడించనుంది. ప్రతీరోజు నామినేషన్ పత్రాలతో పాటు అఫిడవిట్ పత్రాలు డిస్‌ప్లే చేయనున్నారు. 24 గంటల్లోనే ఎలక్షన్ వెబ్‌సైట్‌లో పొందుపరుచుతారు.



మానకొండూరు తహసీల్దార్ ఆఫీస్ వద్ద ఏర్పాట్లు

ఫాం-2బీ ద్వారా నామినేషన్

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఫాం-2బీ ద్వారా నామినేషన్ వేయాల్సి ఉంటుంది. దీంతో పాటు ఫాం-26 ద్వారా అఫిడవిట్ దాఖలు చేయాలి. ఇందులో అభ్యర్థికి సంబంధించిన ఆస్తులు, రాబడి, ఖర్చు, అప్పులు, క్రిమినల్ కేసులు, ఇన్‌కం ట్యాక్స్ చెల్లింపు నమోదు చేయాలి. అఫిడవిట్‌లో అన్ని కాలమ్‌లు పూరించాలి. ఏదైనా కాలమ్ వదిలేస్తే ఆర్వో నుంచి నోటీసు అందుకోవాల్సి వస్తుంది. పరిశీలన తేదీ కంటే ముందుగానే రిటర్నింగ్ అధికారులు అభ్యర్థికి నోటీసు అందజేసి ఖాళీగా ఉంచిన కాలం పూరించేలా సహకరించనున్నారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ పత్రాలు స్వీకరిస్తారు. ఈ నెల 5న ఆదివారం సెలవుదినం కావడంతో ఆరోజు స్వీకరణ ఉండదు. ఒక్కో అభ్యర్థి నాలుగుసెట్లు అందజేసే వీలుంది.

అభ్యర్థులు స్వయంగా అందించాలి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

- జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వారి నామినేషన్లను స్వయంగా సంబంధిత రిటర్నింగ్ అధికారుల కార్యాలయంలో అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం నుంచి అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ మొదలు కానున్న దృష్ట్యా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించినప్పటికి అప్లికేషన్ సక్సెస్ అయిన తరువాత వచ్చే పత్రాలపై అభ్యర్థి స్వయంగా సంతకం చేసి ఆ కాపీలను ఆర్వో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. నామినేషన్ పత్రాలకు కళ్లద్దాలు, కండువ, టోపీ వంటివి లేకుండా బ్యాక్‌గ్రౌండ్ తెలుపుతో అభ్యర్థి స్పష్టంగా కనిపించేలా 20 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు ఇవ్వాలన్నారు. నామినేషన్ దాఖలుకు ఒకరోజు ముందు అభ్యర్థి పేరున ఎన్నికల ఖర్చులకు బ్యాంక్ ఖాతాను ప్రారంభించాలని, ఖాతాకు సంబంధించిన వివరాలను ఆర్వో కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. రిజర్వు చేసిన నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు వారి కులధ్రువీకరణ నామినేషన్ రోజు సమర్పించాలని, ప్రక్రియ ముగిసేలోగా స్క్రూటినీ సమయానికి ఆర్వో కార్యాలయంలో దాఖలు చేయాల్సి ఉంటుందని అన్నారు. నామినేషన్ ముందు జనరల్ అభ్యర్థులు 10 వేలు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలను చెక్కు లేదా చాలన్ రూపంలో సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాలని, ఒక అభ్యర్థి రెండు నియోజక వర్గాలలో ఒకేసారి పోటీ చేసుకోవచ్చని తెలిపారు. చొప్పదండి, మానకొండూర్, కరీంనగర్, హుజురాబాద్‌ల ఆర్వోలు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, కె.మహేశ్వర్, రాజు, జిల్లా రెవెన్యూ అధికారి పవన్ కుమార్, ఏసీపీ అడ్మిన్ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

పోలింగ్ డ్యూటీ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్

పోలింగ్ రోజున విధులలో ఉండి ఓటు హక్కును వినియోగించుకోలేని వారందరికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. విధుల్లో ఉండే వారి వివరాలు సంబంధితశాఖల అధికారుల ద్వారా స్వీకరించి రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను గోప్యంగా ఉంచాలని, ఓటు వివరాలకు వచ్చే ఫిర్యాదుదారులకు సహకరించాలని సూచించారు. చెక్ పోస్టులలో పట్టుబడే వాటి వివరాలను ఆయా రిటర్నింగ్ అధికారులకు ముందుగా తెలియజేయాలని, ఆర్వోలు మానిటరింగ్ విభాగాలకు సమాచారాన్ని అందించాలని తెలియజేశారు.

'స్థానిక' ఎన్నికలకు ముందస్తు కార్యాచరణ

కరీంనగర్ అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికలు 2024లో రానున్నందున ముందస్తుగా కార్యాచరణను రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి అన్నారు. సదరు ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు పక్కా చర్యలుండాలని సూచించారు. గురువారం కరీంనగర్ రెస్ట్ హౌస్‌లో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్, ఆర్డీవోలతో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి, కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



బండి సంజయ్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎంపీ సంజయ్ వాహనం తనిఖీ

కరీంనగర్‌టౌన్/తిమ్మాపూర్ : బీజేపీ అభ్యర్థుల ఎంపికపై చర్చించేందుకు మూడురోజుల క్రితం ఢిల్లీ వెళ్లిన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ గురువారం సాయంత్రం కరీంనగర్ చేరుకున్నారు. దారిమధ్యలో రేణికుంట టోల్‌గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు బండి సంజయ్ వాహనాన్ని తనిఖీ చేశారు. అనంతరం కరీంనగర్‌లోనూ వాహనాన్ని తనిఖీ చేశారు. బండి సంజయ్ రెండు ప్రాంతాల్లో పోలీసులకు సహకరించారు.

ఇన్‌చార్జి అసిస్టెంట్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

- రూ.1.05 కోట్లు ఎఫ్‌డీఆర్ రిలీజ్ చేశాడని ఆరోపణలు
- కరీంనగర్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు తరలివచ్చిన బాధితులు
- కార్యాలయంలో కొంతసేపు ఉద్రిక్తత

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని అక్షర చిట్‌ఫండ్‌కు చెందిన ఎఫ్‌డీఆర్(ఫిక్స్‌డ్ డిపాజిట్ రిసిప్ట్) రూ.1.05 కోట్లు విడుదల చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇన్‌చార్జి అసిస్టెంట్ రిజిస్ట్రార్ పీటర్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్ తెలిపారు. ఎఫ్‌డీఆర్‌ను విడుదల చేసిన విషయం బయటకు పొక్కడంతో అక్షర చిట్‌ఫండ్ బాధితులు 70మంది వరకు గురువారం డీఆర్‌కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. చిట్స్ బాధ్యులు కూడా డీఆర్ కార్యాలయంలో ఉండడంతో కొంతసేపు ఉద్రిక్త వాతవరణం నెలకొంది. వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులు, నిర్వాహకులతో మాట్లాడారు. చిట్స్ యాజమాన్యం, బాధితులు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించుకుని సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతామని చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్న వైనం

చిట్స్ విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన భాగ్యలక్ష్మీ బదిలీ కావడంతో సీనియర్ అసిస్టెంట్ టి.పీటర్ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్నారు. తర్వాత రాజేశ్ ఆ స్థానంలో వచ్చి సుమారు 8 నెలల పాటు పనిచేశారు. తరువాత వ్యక్తిగత సమస్యలతో సెలవులో వెళ్లారు. మళ్లీ ఇన్‌చార్జినే విధులు నిర్వహించారు. కొన్నాళ్లకు దిలీప్‌చంద్ర అసిస్టెంట్‌గా రిజిస్ట్రార్‌గా డిప్యూటేషన్‌పై వచ్చి మూడు నెలలకే తిరిగి వెళ్లారు. అప్పటి నుంచి ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు.



ఆఫీస్‌లో ఆందోళన చేస్తున్న బాధితులు



తహసీల్దార్ ఎదుట హాజరైన సర్పంచ్ శ్రీనివాస్

బొమ్మకల్ సర్పంచ్ బైండోవర్

కరీంనగర్‌రూరల్/కరీంనగర్‌క్రైం: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామ సర్పంచు పురుమల్ల శ్రీనివాస్‌ను గురువారం కరీంనగర్‌రూరల్ తహసీల్దార్ నవీన్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. సర్పంచ్ శ్రీనివాస్‌తో పాటు మరో 10 మందిని బైండోవర్ చేశారు. కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రేసులో ఉన్న శ్రీనివాస్‌ను ఆకస్మికంగా రూరల్ పోలీసులు బైండోవర్ చేయడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. శ్రీనివాస్‌పై రౌడీషీట్‌తోపాటు పలు కేసులు నమోదు కావడంతో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా బైండోవర్ చేసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఆరునెలలపాటు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సర్పంచు శ్రీనివాస్‌కు తహసీల్దార్ నోటీసులిచ్చారు. అయితే శ్రీనివాస్‌ను బైండోవర్ చేయడం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఆందోళనకు గురిచేస్తోంది.



ఎవరైతే ధర్మాన్ని సరిగా నిర్వర్తిస్తారో.. వారే దేశాన్ని ఉద్ధరించగలరు.
– డాక్టర్ బీఆర్. అంబేడ్కర్

మీకు తెలుసా..?

కాంగ్రెస్‌కు కాడెడ్లు.. కమ్యూనిస్టులకు 'హస్తం'

కరీంనగర్: హస్తం గుర్తును మొదటి సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టులకు కేటాయించారు. 1952లో కాంగ్రెస్ పార్టీది కాడెడ్ల గుర్తు కాగా, అప్పట్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆ గుర్తుపైనే పోటీ చేసింది. హైదరాబాద్ సంస్థానం మినహా దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ కమ్యూనిస్టు పార్టీలు కంకి, కొడవలి గుర్తుపై పోటీ చేశారు. హైదరాబాద్ సంస్థానంలో కమ్యూనిస్ట్ పార్టీపై నిషేధం ఉండడంతో ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) పేరిట ఎన్నికల్లో పోటీ చేశారు. ఎన్నికల సంఘం పీడీఎఫ్ అభ్యర్థులకు హస్తం గుర్తును కేటాయించింది. అప్పటి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులకు చెయ్యి గుర్తు కేటాయించేది. 1957 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కమ్యూనిస్ట్ పార్టీలకు కంకి కొడవలి గుర్తు లభించింది .తరువాత కాలంలో కమ్యూనిస్టులు సీపీఐ, సీపీఐ(ఎం)గా విడిపోయాయి. ఎన్నికల సంఘం సీపీఐకి కంకి, కొడవలి, సీపీఐ(ఎం)కు సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తులను కేటాయించింది. 1970 లో కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలగా ఇందిరాగాంధీకి ఆవుదూడ గుర్తు రాగా , మరోసారి కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలిన సమయంలో 1978లో ఇందిరాగాంధీ హస్తం గుర్తు స్వీకరించారు. ఇక అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీది చెయ్యి గుర్తుగా కొనసాగుతోంది.



క్లుప్తంగా

విద్యుత్‌ సబ్‌స్టేషన్ల తనిఖీ



సబ్‌స్టేషన్‌లో పరిశీలిస్తున్న సీజీఎం అశోక్‌కుమార్‌

కొత్తపల్లి(కరీంనగర్‌): కరీంనగర్‌లోని 33/11 కేవీ అంబేడ్కర్‌ నగర్‌, భగత్‌నగర్‌, ఉజ్వల పార్కు, టవర్‌ సర్కిల్‌ సబ్‌స్టేషన్లను టీఎస్‌ఎన్‌పీడీసీఎల్‌ సీజీఎం(ఎమ్మార్టీ) బి.అశోక్‌కుమార్‌ గురువారం తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్ల నిర్వహణతోపాటు విద్యుత్‌ సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. సమస్యలపై ఆరా తీశారు. లోపల ఇనుప స్తంభాలకు పెయింటింగ్‌, బ్రేకర్ల మెకానిజం, వాటర్‌ ట్యాంకుల లీకేజీ వంటి సమస్యలను గుర్తించి, వాటిని వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. అలాగే, వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ అందించడంతోపాటు రెవెన్యూపై దృష్టిసారించాలన్నారు. డీఈ రాజం, ఏడీఈ సుధీర్‌కుమార్‌, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



దుర్గయ్య (ఫైల్‌)

ఇల్లందకుంట(హుజూరాబాద్‌): చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. వంతడ్పుల గ్రామానికి చెందిన సప్పి దుర్గయ్య (70) గత నెల 31న రాత్రి బాత్‌రూంకు వెళ్తూ కాలు జారి కిందపడ్డాడు. ఈ ఘటనలో ఆయన తలకు గాయమై, కోమాలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు వరంగల్‌ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుని కొడుకు కుమార్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్‌ పేర్కొన్నారు.

జగ్గయ్యపల్లిలో డీజే బాక్స్‌లు, వాహనం సీజ్‌

జమ్మికుంట(హుజూరాబాద్‌): అధిక సౌండ్‌తో ప్రజలకు అసౌకర్యం కలిగించిన డీజే వాహనాన్ని సీజ్‌ చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని జగ్గయ్యపల్లిలో గురువారం డీజే బాక్స్‌లతో బీఆర్‌ఎస్‌ పార్టీ ప్రచారం నిర్వహించారు. దీనివల్ల స్థానిక ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఎన్నికల ఎఫ్‌ఎస్‌టీ అధికారి వెంకటేశ్వర్లు వాహనాన్ని, డీజే బాక్స్‌లను సీజ్‌ చేసి, పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ



కమాన్‌పూర్‌లో విచారణ జరుపుతున్న ఏసీపీ కరుణాకర్‌ రావు

కొత్తపల్లి(కరీంనగర్‌): మండలంలోని కమాన్‌పూర్‌, ప్రగతినగర్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై కరీంనగర్‌ రూరల్‌ ఏసీపీ టి.కరుణాకర్‌ రావు గురువారం విచారణ చేపట్టారు. కమాన్‌పూర్‌ పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్‌కు చెందిన స్వామి, భానుప్రసాద్‌లు కులం పేరుతో దూషించారని బాధితుడు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదవగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట కొత్తపల్లి ఎస్సై చంద్రశేఖర్‌ తదితరులు ఉన్నారు.

సైకిళ్లు పాయె.. 'తెర'లొచ్చె

- ఎల్‌ఈడీ స్క్రీన్లు, డీజేలు, కళాకారుల బృందాలతో సందడి
- కాలానికనుగుణంగా ఎన్నికల ప్రచారంలో మార్పులు
- ప్రత్యేక పాటలతో ప్రజల్లోకి వెళ్తున్న అభ్యర్థులు

'పాత రోజుల్లో ఎన్నికలు వచ్చాయంటే గ్రామాల్లో, పట్టణాల్లో గోడలపై వాల్‌ రైటింగ్‌ చేసేవారు. కూడళ్లలో అభ్యర్థుల ఫొటోలు, గుర్తులతో పెయింటింగ్‌ వేసిన బ్యానర్లు కట్టేవారు. సైకిళ్లపై రోజుకు రెండు, మూడు గ్రామాలు తిరుగుతూ ఎన్నికల ప్రాధాన్యతను వివరించి, ఓటడిగేవారు. కానీ, కాలానికనుగుణంగా ప్రచారంలో మార్పులు వచ్చాయి. అభ్యర్థులు ఎల్‌ఈడీ స్క్రీన్లు, డీజే సౌండ్‌ బాక్సులు, కళాకారుల బృందాలతో ప్రజల మనసు దోచేలా ప్రచార పర్వాన్ని హోరెత్తిస్తున్నారు. ప్రత్యేక పాటలతో అంతటా సందడి వాతావరణం కనిపిస్తోంది.'



కరీంనగర్‌లో బీఆర్‌ఎస్‌ ప్రచార రథంపై ఎల్‌ఈడీ స్క్రీన్‌ ద్వారా ప్రచారం

కరీంనగర్‌: పాట ప్రజలకు ఊపునిస్తుంది. ఎన్నికల హామీలు, అభ్యర్థి ప్రత్యేకతలను ఆకట్టుకునే పదాలతో వినసొంపుగా వినిపిస్తుంది. అందుకే అన్ని పార్టీల అభ్యర్థులు పాటలను నమ్ముకొని, ఎన్నికల ప్రచారంలోకి దిగుతున్నారు. గతంలో లౌడ్‌ స్పీకర్‌ పెడితే ఆ పాటలు అర్థమయ్యేవి కావు. పెరిగిన టెక్నాలజీని సద్వినియోగం చేసుకొని, ఎల్‌ఈడీ స్క్రీన్లు, డీజే సౌండ్‌ బాక్సులు, జోష్‌ పెంచే పాటలతో పార్టీలు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ఎల్‌ఈడీ స్క్రీన్లపై అభ్యర్థులు, పార్టీ నేపథ్యాన్ని చాటే ఫొటోలు, వీడియోలకు బ్యాక్‌గ్రౌండ్‌లో పాటలు ఆసక్తి పెంచుతున్నాయి. ఇప్పటికే ఈ తరహా ప్రచార సందడి మొదలైంది. కరీంనగర్‌ నగరంలో అభ్యర్థిత్వం ఖరారైనవారి పాటలతో ప్రచార రథాలు పది రోజులుగా సందడి చేస్తున్నాయి. అభ్యర్థిత్వం ఖరారు కానివారు పార్టీ కోసం రాయించిన పాటలను వినిపిస్తూ ప్రచార రథాలను తిప్పుతున్నారు.

ఆకట్టుకుంటున్న కళాబృందాల పాటలు

ఎన్నికల ప్రచారం రెండు విధాలుగా సాగనుంది. ఒకటి కళాజాత బృందాలు పాడుతూ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నాయి. చమక్కులు విసురుతూ పాట, మాటలతో ఆకట్టుకుంటూ అభ్యర్థి గురించి వివరిస్తున్నారు. ఈ బృందంలో కనీసం పది మంది కళాకారులు ఉంటారు. మరొకటి రికార్డింగ్‌ పాటలు. ఆయా అభ్యర్థులు పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వాన్ని చూపే వీడియోలను రికార్డింగ్‌ పాటలకు జోడించి, క్లిప్పింగ్‌లు తయారు చేస్తున్నారు. అలాగే తమతమ పార్టీలు మేనిఫెస్టోలో పెట్టిన హామీలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను జోడించి ప్రచారం నిర్వహిస్తున్నారు. డ్రైవర్‌ మాత్రమే ఉండే ప్రచార రథాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లపై వీటిని ప్రదర్శిస్తున్నారు. దద్దరిల్లే సౌండ్‌తో ఇవి గ్రామాలు, పట్టణాలను చుట్టేస్తున్నాయి.

ఖర్చుకు వెనకాడని అభ్యర్థులు

కరీంనగర్‌ జిల్లాలోని అభ్యర్థులంతా తమ పేరుతోనే హైదరాబాద్‌ కేంద్రంగా పాటలు రికార్డింగ్‌ చేయించుకుంటున్నారు. ఒక్కొక్కరు తమ పేరిట కనీసం 10 పాటలు రాయిస్తున్నారు. ఇక పార్టీ అధిష్టానం ఇచ్చేవి అదనం. పేరున్న కళాకారులతో పాటలు పాడించడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు ఒక్కో అభ్యర్థి సుమారు రూ.5 లక్షల వరకు వెచ్చిస్తున్నట్లు సమాచారం. ఈ పాటలకు వీడియోలు జత చేయడానికి మరో రూ.2 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు తెలిసింది.

కళాకారులకు డిమాండ్‌..

అసెంబ్లీ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌, బీజేపీ నుంచి అభ్యర్థులు బరిలో నిలవనున్నారు. వీరికి తోడు స్వతంత్రులు, ఇతర పార్టీలవారు సైతం తమ శక్తికి మించి ప్రచార రథాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఒక్కో పార్టీకి కళాజాత బృందాలు కనీసం మూడు అవసరమవుతాయి. నియోజకవర్గంలోని ఒకటి అభ్యర్థి వెంట, మిగతా రెండు ఇతర మండలాల్లో ప్రచారం నిర్వహించాల్సి ఉంటుంది. ఒక్క ప్రధాన పార్టీలనే తీసుకుంటే నియోజకవర్గానికి కనీసం తొమ్మిది బృందాలు కావాలి. ఒక్కోదానిలో సుమారు 10 మంది కళాకారులు ఉండాలి. జిల్లాలో కళాకారులు పరిమిత సంఖ్యలో ఉండటంతో ఇతర ప్రాంతాల వారిపై ఆధారపడాల్సి వస్తోందని సమాచారం. జానపద కళాకారులు సొంత యూట్యూబ్‌ చానళ్ల ద్వారా పేరు పొందాక చిన్నపాటి వేదికలపై ప్రదర్శనలు ఇవ్వడానికి ఆసక్తి చూపడం లేదని తెలిసింది. దీంతో అభ్యర్థులు కళాకారుల కోసం అన్వేషిస్తున్నారు. ఏదేమైనా ఎన్నికల సీజన్‌లో పదో పరకో వెనకేసుకునేందుకు కళాకారులు ఉత్సాహం చూపుతున్నారు.

'ఎల్‌ఎండీ'లో దూకిన యువకుడు

- కుటుంబ కలహాలే కారణం
- దొరకని ఆచూకీ
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబసభ్యులు



అభిలాష్‌



వాగులో గాలిస్తున్న గజ ఈతగాళ్లు



రోదిస్తున్న కుటుంబసభ్యులు

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): కుటుంబ కలహాలతో ఓ యువకుడు మోయతుమ్మెద వాగు(ఎల్‌ఎండీ బ్యాక్‌ వాటర్‌)లో దూకిన ఘటన తిమ్మాపూర్‌ మండలంలోని రేణికుంట బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గన్నేరువరం మండలంలోని ఖాసీంపేటకు చెందిన సందెబోయిన అభిలాష్‌ అలియాస్‌ టింకు బుధవారం రాత్రి రేణికుంట శివారులోని రాజీవ్‌ రహదారి బ్రిడ్జి పైనుంచి ఎల్‌ఎండీ బ్యాక్‌ వాటర్‌లో దూకాడు. అంతకుముందు తన ఫోన్‌లో వాట్సాప్‌ స్టేటస్‌ పెట్టుకున్నాడు. అది చూసిన కుటుంబసభ్యులు వెంటనే ఎల్‌ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ప్రమోద్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గురువారం ఉదయం గజ ఈతగాళ్లను రప్పించి, గాలింపు చేపట్టారు. ఇప్పటివరకు అభిలాష్‌ ఆచూకీ దొరకలేదని ఎస్సై తెలిపారు.

నాణ్యమైన పత్తికి మద్దతు ధర

- కరీంనగర్‌ డీఎంవో పద్మావతి
- జమ్మికుంటలో సీసీఐ కొనుగోళ్లు ప్రారంభం



సీసీఐ కొనుగోళ్లు ప్రారంభిస్తున్న డీఎంవో పద్మావతి

జమ్మికుంట(హుజూరాబాద్‌): నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి, రైతులు మద్దతు ధర పొందాలని జిల్లా మార్కెటింగ్‌ అధికారి పద్మావతి సూచించారు. గురువారం జమ్మికుంటలోని స్థానిక పత్తి మార్కెట్‌యార్డులో సీసీఐ అధికారి చంద్రశేఖర్‌, మార్కెట్‌ కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్‌తో కలిసి సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. డీఎంవో పద్మావతి మాట్లాడుతూ.. 2023– 24 సీజన్‌లో పత్తి క్వింటాల్‌కు ప్రభుత్వం మద్దతుధర రూ.7,020 ప్రకటించిందని తెలిపారు. జిల్లాలోని 11చోట్ల కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశారమని వివరించారు. కరీంనగర్‌లో మూడు, జమ్మికుంటలో ఆరు, చొప్పదండి, గోపాల్‌రావుపేటలో ఒకటి చొప్పున సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు జరుగుతాయని అన్నారు. తేమశాతం 8 ఉన్న నాణ్యమైన పత్తికి గరిష్ట ధర రూ.7,020, 9శాతం తేమ ఉంటే రూ.6,949, 10శాతం తేమ ఉంటే రూ.6,879, 11శాతం తేమ ఉంటే రూ.6,809, 12శాతం తేమ ఉంటే రూ 6,739 ధరతో సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుందని అన్నారు. 12శాతానికి మించి ఉంటే సీసీఐ కొనుగోలు చేయదని వివరించారు. రైతులు ఆధార్‌కార్డు, బ్యాంకుఖాతా, ఫోన్‌నంబర్‌ లింకై ఉండాలని సూచించారు. మార్కెటింగ్‌ సూపర్‌వైజర్లు లక్ష్మణ్‌, యాకయ్య, బాబా ఉన్నారు.

సీసీఐ బోణీ

జమ్మికుంట మార్కెట్లో సీసీఐ కొనుగోళ్లు ప్రారంభమైన సందర్భంగా మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన సంపత్‌, వీణవంక మండలం మామిడాలపల్లికి చెందిన కుమార్‌ తీసుకొచ్చిన పత్తిని సీసీఐ అధికారులు కొనుగోలు చేసి బోణీ కొట్టారు. అదే విధంగా జమ్మికుంట పాత వ్యవసాయ మార్కెట్‌లో సీఏసీఎస్‌ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఎంవో పద్మావతి ప్రారంభించారు. క్వింటాల్‌కు గ్రేడ్‌ ఏ మద్దతు ధర రూ.2,203, కామన్‌ రకానికి రూ.2,183 ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు.

'పారమిత' ఎన్‌సీసీ విద్యార్థుల ప్రతిభ



కరీంనగర్‌: హైదరాబాద్‌లో డైరెక్టర్‌ జనరల్‌ ఆఫ్‌ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో గత అక్టోబర్‌ 23 నుంచి ఈ నెల 1 వరకు జాతీయ స్థాయి ఏక్‌ భారత్‌–శ్రేష్ఠ భారత్‌ క్యాంపు నిర్వహించారు. ఇందులో కరీంనగర్‌లోని మంకమ్మతోట పారమిత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నట్లు ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పింగిళి విజికా రెడ్డి (కూచిపూడి నాట్యం), బూడిద రేవంత్‌ కౌశిక్‌(ఎస్‌ఐఏపీ–సంస్కృతి), గౌడ హృదయ్‌(వాయిద్యం), గజ్జెల అశ్విత్‌ (ఎస్‌ఐఏపీ–సంస్కృతి), అడ్ల హన్సిత్‌(ఎస్‌ఐఏపీ–సంస్కృతి) నిజామాబాద్‌ ఎన్‌సీసీ గ్రూప్‌ హెడ్‌ క్వార్టర్‌ విభాగం నుంచి అద్భుత ప్రదర్శన ఇచ్చారన్నారు. వీరిని 9 తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్‌ కమాండింగ్‌ ఆఫీసర్‌ డానియల్‌ లాట్జిమ్‌ అభినందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పారమిత విద్యాసంస్థల అధినేత ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రాకేశ్‌, రశ్మిత, అనుకర్‌రావు, వినోదరావు, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్‌, కవిత తదితరులు గురువారం అభినందించారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో తృతీయ స్థానం



ట్రోఫీ అందుకుంటున్న బాలికల జట్టు

కరీంనగర్‌ స్పోర్ట్స్‌: హనుమకొండలో జరిగిన 67వ రాష్ట్రస్థాయి అండర్‌–14 బాలబాలికల జూడో చాంపియన్‌షిప్‌ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా బాలికల జట్టు ప్రతిభ కనబరిచి, తృతీయ స్థానంలో నిలిచింది. 3 రజత, 2 కాంస్య పతకాలతో మొత్తం 11 పాయింట్లు సాధించి, తృతీయ చాంపియన్‌గా ట్రోఫీ అందుకుంది. ఈ జట్టులో సాత్విక, స్వాతి, శివాని, మన్విత, సంధ్య పతకాలు కైవసం చేసుకున్నారు. కాగా, జట్టుకు కోచ్‌, మేనేజర్లుగా ఎల్‌.వెంకటరమణ, మహేందర్‌, శ్రీధర్‌కుమార్‌ వ్యవహరించారు. జట్టు ట్రోఫీ అందుకోవడం పట్ల డీఈవో జనార్దన్‌రావు, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు, జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి పోతన శ్రీనివాస్‌, జూడో సంఘం జిల్లా అధ్యక్షుడు కడారి అనంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌ రెడ్డి, పలు క్రీడా సంఘాల బాధ్యులు, పీఈటీలు, పీడీలు గురువారం హర్షం వ్యక్తం చేశారు.

'ఎస్సారార్‌'లో ఫెర్మెంటిలిసియస్‌ స్టాల్స్‌



ఆహార పదార్థాలతో ప్రిన్సిపాల్‌ రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు

కరీంనగర్‌సిటీ: ఎస్సారార్‌ ప్రభుత్వ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాలలో సూక్ష్మ జీవశాస్త్రం, జీవ సాంకేతిక శాస్త్ర శాఖల ఆధ్వర్యంలో గురువారం ఫెర్మెంటిలిసియస్‌ స్టాల్స్‌ ఏర్పాటు చేశారు. విద్యార్థులు పులిసిన పిండితో చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్‌ కల్వకుంట రామకృష్ణ వాటిని రుచి చూసి, విద్యార్థులను అభినందించారు. ఇడ్లీ, వడ, బ్రెడ్‌, దోశ వంటివన్నీ పులిసిన ఆహారమని, వీటి ద్వారా ఉపయోగకరమైన సూక్ష్మజీవులు, ఈస్ట్‌, విటమిన్స్‌ మినరల్స్‌ లభిస్తాయని తెలిపారు. సూక్ష్మ జీవశాస్త్ర శాఖ అధిపతి ముత్తన్న, జీవ సాంకేతిక శాస్త్ర అధిపతి డాక్టర్‌ కిశోర్‌లను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మృదుల, లత, మహేశ్‌, రాజు పాల్గొన్నారు.

శబరిమలకు అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సులు

విద్యానగర్‌(కరీంనగర్‌): శబరిమల వెళ్లే భక్తులకు అద్దె ప్రాతిపదికన టీఎస్‌ఆర్టీసీ బస్సులు పంపిస్తున్నట్లు కరీంనగర్‌ రీజినల్‌ మేనేజర్‌ ఎస్‌.సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ ఇటీవల సమకూర్చుకున్న 700 కొత్త సూపర్‌ లగ్జరీ బస్సుల్లో సుశిక్షితులైన డ్రైవర్లతో శబరిమలకు భద్రమైన ప్రయాణానికి అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ బస్సుల్లో టీవీ సౌకర్యం ఉందని, అద్దెకు తీసుకుంటే ఇద్దరు మణికంఠ స్వాములు, ఇద్దరు వంట మనుషులు, సామగ్రి సర్దేందుకు ఒక వ్యక్తి (సీటు లేకుండా) ఉచితంగా ప్రయాణించే అవకాశంతోపాటు బస్సు బుక్‌ చేసిన గురు స్వామికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఒకటి కంటే ఎక్కువ బస్సులు బుక్‌ చేసిన గురుస్వామికి వాటిపై రోజుకు రూ.300 కమీషన్‌గా ఇస్తామన్నారు. భక్తులు శబరిమలకు వెళ్లే దారిలోని ఇతర పుణ్యక్షేత్రాలనూ దర్శించుకునే వెసులుబాటు ఉంటుందని, వివరాలకు సమీప డిపో మేనేజర్లను సంప్రదించాలని కోరారు.

ఫంక్షన్‌హాళ్లకు అనుమతి తప్పనిసరి

- కరీంనగర్‌ రూరల్‌ ఏసీపీ కరుణాకర్‌రావు



చింతకుంటలోని ఫంక్షన్‌హాల్‌ను తనిఖీ చేస్తున్న ఏసీపీ కరుణాకర్‌రావు

కొత్తపల్లి: ఎన్నికల నిబంధనల నియమావళిలో భాగంగా ఎన్నికల అధికారుల అనుమతుల్లేకుండా రాజకీయ పార్టీల సమావేశాలకు, సామగ్రి నిల్వ చేసుకునేందుకు ఫంక్షన్‌హాళ్లు ఇవ్వొద్దని కరీంనగర్‌ రూరల్‌ ఏసీపీ టి.కరుణాకర్‌రావు సూచించారు. కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని రేకుర్తి, చింతకుంట గ్రామాల్లోని ఫంక్షన్‌ హాళ్లను గురువారం తనిఖీ చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ఫంక్షన్‌హాళ్లను ఇస్తే కేసు నమోదు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కొత్తపల్లి ఎస్సై డి.చంద్రశేఖర్‌, పోలీసు సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయంపై దాడి కేసులో 11 మందికి జైలు

సిరిసిల్ల క్రైం: తహసీల్దార్‌ కార్యాలయంపై దాడి చేసిన 11 మందికి ఏడాది సాధారణ జైలుశిక్షతోపాటు రూ.3 వేల చొప్పున జరిమానా విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి ప్రవీణ్‌ గురువారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. నిమ్మపల్లికి చెందిన ఉప్పర కులస్తులు జవ్వాజి పూజ, విమల, చంద్రకళ, మేదరి దేవయ్య, బండ రాజయ్య, బండ సత్తయ్య, పూజమ్‌ రాజయ్య, గంగాధర్‌, పూజం లింగయ్య, రెడ్డిమల్ల లచ్చయ్య, మ్యాదరి మధు, జవ్వాజి గంగాధర్‌లు 19 ఫిబ్రవరి 2017లో కోనరావుపేట తహసీల్దార్‌ ఆఫీస్‌లోకి దౌర్జన్యంగా చొరబడి, సిబ్బందిని బయటకు వెళ్లగొట్టారు. కార్యాలయంలోని ఫర్నిచర్‌ ధ్వంసం చేశారు. అప్పటి తహసీల్దార్‌ డి.నాగరాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎం.మాలకొండరాయుడు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపారు. అనంతరం చార్జిషీట్‌ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్‌ ఎస్‌ఐ శ్రీకాంత్‌ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్‌ మోహన్‌ సాక్షులను ప్రవేశపెట్టగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన జడ్జి శిక్ష ఖరారు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కోనరావుపేట ఎస్‌ఐ ఆంజనేయులు హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి





రవి (ఫైల్‌), కుమార్‌ సింగ్‌ (ఫైల్‌)

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామ శివారులోని స్టోన్‌ క్రషర్‌ వద్ద పని కోసం లారీపై తరలిస్తున్న ఎక్స్‌వేటర్‌ యంత్రం వేలాడుతున్న కరెంటు తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై భూక్య రవి(40) అక్కడికక్కడే మరణించాడు. తీవ్రంగా గాయపడ్డ లారీ డ్రైవర్‌ దీప్‌నారాయణ్‌ కుమార్‌సింగ్‌(38) చికిత్స పొందుతూ కరీంనగర్‌లో మరణించాడు. క్లీనర్‌ ఉదయ్‌ చౌదరి గాయపడి చికిత్స పొందుతున్నారు. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను బసంత్‌నగర్‌ ఎస్సై వెంకటేశ్‌ వెల్లడించారు. హుస్నాబాద్‌ నుంచి పెద్దపల్లి మండలం బొంపల్లి శివారులోని క్రషర్‌లో పని చేసేందుకు వస్తుండగా జరిగిన ప్రమాదంలో నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం దంజాతండాకు చెందిన భూక్య రవి అక్కడికక్కడే మరణించాడని తెలిపారు. మృతుడికి భార్య కవిత, ఇద్దరు పిల్లలున్నారు. లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న బీహార్‌ రాష్ట్రానికి చెందిన దీప్‌నారాయణ్‌ కుమార్‌సింగ్‌, క్లీనర్‌ ఉదయ్‌ చౌదరి గాయపడ్డారు. వారిని పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చేయించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దీప్‌నారాయణ్‌ కుమార్‌సింగ్‌ మరణించాడు. ఉదయ్‌ చౌదరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని ఎస్సై తెలిపారు. మృతుడు రవి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం

బొంపల్లి గ్రామ శివారులో విద్యుత్‌ తీగలు వేలాడుతున్నాయని, వాటిని సరి చేయాలంటూ విద్యుత్‌ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం వల్లే రెండు నిండు ప్రాణాలు బలయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కరెంటు తీగలతో ప్రమాదముందంటూ పంచాయతీ పాలకులు, క్రషర్‌ యజమాన్యం రాతపూర్వకంగా ఫిర్యాదులు చేసినా సంబంధిత విద్యుత్‌ అధికారుల్లో స్పందన కరువైందని వాపోతున్నారు.

మరో పది నిమిషాలైతే..

హుస్నాబాద్‌ నుంచి ఎక్స్‌వేటర్‌తో లారీపై బయల్దేరిన వారు మరో పది నిమిషాలైతే పని చేయాల్సిన స్టోన్‌ క్రషర్‌ వద్దకు చేరుకునేవారని స్థానికులు పేర్కొంటున్నారు. క్షణాల్లో విద్యుదాఘాతానికి గురై ఇరువురు మరణించడం పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

కూల్‌డ్రింక్‌లో విషం కలిపి తాగించిన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బీట్‌బజార్‌ ప్రాంతానికి చెందిన బోడ చంద్రకళ అనే మహిళకు బలవంతంగా కూల్‌డ్రింక్‌లో విషం కలిపి తాగించిన గోవర్దన్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్‌ తెలిపారు. చంద్రకళ విద్యుత్‌ శాఖలో ఫిల్టర్‌ మెకానిక్‌ గ్రిడ్‌గా పని చేస్తుంది. అదే శాఖలో పని చేసే గోవర్దన్‌ అక్టోబర్‌ 30న కూల్‌డ్రింక్‌ తీసుకొచ్చి చంద్రకళకు ఇవ్వగా.. ఆమె తాగేందుకు నిరాకరించింది. బలవంతం చేయడంతో ఆమె కూల్‌డ్రింక్‌ తాగగా.. అస్వస్థతకు గురైంది. ఫోన్లో భర్త బోడ మోహన్‌కు సమాచారమందించింది. మోహన్‌ కార్యాలయానికి వెళ్లి చంద్రకళను ఆస్పత్రిలో చేర్పించగా.. వైద్యులు కూల్‌డ్రింక్‌లో విషం కలపడం వల్లే అస్వస్థతకు గురైందని వెల్లడించారు. మోహన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

32.7 కేజీల గంజాయి దహనం



సిరిసిల్ల క్రైం: డిస్ట్రిక్ట్‌ డ్రగ్స్‌ డిస్పోజల్‌ కమిటీ చైర్మన్‌, జిల్లా ఎస్పీ అఖిల్‌ మహాజన్‌, అడిషనల్‌ ఎస్పీ చంద్రయ్య, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం 32.7 కేజీల గంజాయిని పోలీసులు కాల్చివేశారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదైన 41 కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయిని శాస్త్రీయ పద్ధతిలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత బానిసలుగా మారి, తమ భవిష్యత్‌ను చేజేతులా నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో గంజాయి రవాణాను పోలీసులు సమర్థంగా నిరోధిస్తున్నారని పేర్కొన్నారు. గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలను రవాణా చేసేవారిపై పీడీ యాక్టు నమోదు చేసి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉదయ్‌ రెడ్డి, ఆర్‌ఐ యాదగిరి, సీఐ ఉపేందర్‌, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురికి రెండేళ్ల జైలు

జగిత్యాలజోన్‌: పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని ఓ వ్యక్తిపై దాడి చేసిన కేసులో ముగ్గురు నిందితులకు రెండేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ జగిత్యాల ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి శ్రీనిజ గురువారం తీర్పు చెప్పారు. జగిత్యాల టౌన్‌ సీఐ నటేష్‌ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన శీలం సాయిరాజ్‌ అనే వ్యక్తిపై పాత కక్షలను మనసులో పెట్టుకొని డిసెంబర్‌ 6, 2015న అదే ప్రాంతానికి చెందిన తరాల బండి శ్రీనివాస్‌, పాలకుర్తి రాజు అలియాస్‌ డిబ్రి రాజు, ఇంద్రాల నరేష్‌ అనే ముగ్గురు వ్యక్తులు కట్టెతో దాడి చేశారు. సాయిరాజ్‌కు తీవ్ర గాయాలు కాగా.. ఆసుపత్రికి తరలించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్‌ఐ రాజేశ్వర్‌రావు కేసు నమోదు చేసుకున్నారు. పోలీసులు నిందితులను అరెస్ట్‌ చేసి కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్‌ అధికారి శ్రీనివాస్‌ బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో.. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం నిందితులైన ముగ్గురికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.500 చొప్పున జరిమానా విధించారు.

రూ.19.02 లక్షలు పట్టివేత

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అరవింద్‌నగర్‌లో పట్టణ పోలీసులు, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ బృందాలు తనిఖీ చేశారు. వేణుగోపాల్‌ అనే వ్యక్తి వద్ద రూ.14.02 లక్షలు, శ్రీనివాస్‌ అనే వ్యక్తి వద్ద రూ.5 లక్షలు పట్టుకున్నారు. నగదును గ్రీవెన్‌సెల్‌ కమిటీకి అప్పగించినట్లు పట్టణ సీఐ నటేశ్‌ తెలిపారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
3-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	490	64,081
నిఫ్టీ ▲	144	19,133

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	13,260	▲ 199
డోజోన్స్	33,721	▲ 446
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,447	▲ 104
డాక్స్	15,144	▲ 220
షాంఘై	3,009	▲ 14
నికాయ్	31,950	▲ 348

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	61,092	▲ 80
బంగారం (99.5 స్వచ్ఛత)	60,847	▲ 79
వెండి (కిలో)	71,684	▲ 700

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.49	84.26
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.73	101.94
€	యూరో	ఎస్‌బీఐ	86.78	89.19
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.27	55.87
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.63	54.39
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.12	60.98
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.23	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.87	23.49
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.23	12.29

పోస్ట్ ద్వారా 2,000 నోట్ల మార్పిడి

బ్యాంక్ అకౌంట్లలో డబ్బు జమ



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయాలకు దూరంగా ఉండే ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2,000 నోట్లు మార్చుకోవడానికి సులభతరమైన విధానం అమలవుతోంది. పోస్ట్ ద్వారా ఈ మేరకు ప్రజలు సేవలు పొందవచ్చని ఇప్పటికే ప్రకటించిన ఆర్‌బీఐ ఉన్నతాధికారులు ఇందుకు వీలైన ప్రక్రియపై ప్రచారాన్ని చేపట్టారు. ఇన్సూర్డ్ పోస్ట్ లేదా టీఎల్ఆర్ (3 అంచెల రక్షణ) కవర్‌ను వినియోగించుకుని సురక్షితమైన మార్గంలో రూ.2,000 నోట్లు మార్చుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ విధానంలో పెద్ద నోట్ల మార్పిడికి సంబంధించిన డబ్బు సంబంధిత వినియోగదారు బ్యాంక్ ఖాతాల్లో జమవుతుంది. ''కస్టమర్‌లు రూ. 2,000 నోట్ల మార్పునకు సంబంధించిన డబ్బు తమ ఖాతాలో అత్యంత సురక్షితమైన పద్ధతిలో ప్రత్యక్షంగా క్రెడిట్ కావడానికి వీలుగా ఇన్సూర్డ్ పోస్ట్‌ను వినియోగించుకోవాలని ప్రోత్సహిస్తున్నాము. ఈ విధానం నిర్దేశిత ప్రాంతీయ కార్యాలయాలకు ప్రయాణించడం, వరుసలో నిలబడ్డం వంటి ఇబ్బందుల నుంచి వినియోగదారుని నివారిస్తుంది'' అని ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ రోహిత్ పి. దాస్ అన్నారు. చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 97 శాతానికి పైగా తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థకు చేరాయని ఆర్‌బీఐ తెలిపింది. అక్టోబర్ 30వ తేదీ నాటికి రూ.10,000 కోట్ల విలువైన నోట్లు మాత్రమే ప్రజల వద్ద ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది మే 19న ఆర్‌బీఐ రూ.2,000 డినామినేషన్ నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. దేశంలోని 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో ప్రజలు రూ. 2,000 నోట్లను డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. రూ.2 వేల నోట్ల డిపాజిట్ లేదా మార్పిడి సేవలను బ్యాంకు శాఖలు అక్టోబర్ 7 వరకు అందించాయి. అక్టోబర్ 8 నుంచి ఈ సేవలు 19 ఆర్‌బీఐ కార్యాలయాలకు మారాయి.

కోటక్ ఇన్సూరెన్స్‌లో 'జ్యూరిక్'కు వాటాలు

51% కొనుగోలు;
డీల్ విలువ రూ. 4,051 కోట్లు

ముంబై: సాధారణ బీమా సంస్థ కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో (కేజీఐ) స్విట్జర్లాండ్‌కు చెందిన జ్యూరిక్ ఇన్సూరెన్స్ 51 శాతం వాటాలు దక్కించుకోనుంది. ఇందుకోసం రూ. 4,051 కోట్లు వెచ్చించనుంది. తదుపరి అదనంగా మూడేళ్లలో అదనంగా 19 శాతం వాటాలు కూడా జ్యూరిక్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయనున్నట్లు కేజీఐ మాతృ సంస్థ కోటక్ మహీంద్రా బ్యాంక్ వెల్లడించింది. వృద్ధి అవకాశాలు పటిష్టంగా ఉన్న కీలక మార్కెట్లలో భారత్ కూడా ఒకటని, కేజీఐ తమకు పటిష్టమైన భాగస్వామి కాగలదని జ్యూరిక్ సీఈవో (ఆసియా పసిఫిక్) తులసి నాయుడు తెలిపారు. తమ కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇరు సంస్థల వనరులు, అనుభవం తోడ్పడగలవని కోటక్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ దీపక్ గుప్తా పేర్కొన్నారు. ప్రీమియంలపరంగా నాన్-లైఫ్ మార్కెట్‌లో సెప్టెంబర్‌లో కేజీఐకి 0.52 శాతం వాటా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం రూ. 1,148 కోట్ల మేర స్థూల ప్రీమియం సాధించింది. కొత్త పెట్టుబడుల అనంతరం సంస్థ విలువ రూ. 7,943 కోట్లుగా ఉండనుంది.


ఫ్యాషన్ స్టార్టప్స్‌లో అజియో పెట్టుబడులు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 100 డైరెక్ట్ టు కస్టమర్ ఫ్యాషన్ స్టార్టప్స్‌లో పెట్టుబడి పెట్టాలని లైఫ్‌స్టైల్, ఫ్యాషన్ ఈ-కామర్స్ కంపెనీ అజియో భావిస్తోంది. ఈ స్టార్టప్స్ తయారు చేసే, విక్రయించే దుస్తులు, పాదరక్షలు, యాక్సెసరీస్ వంటి ఉత్పత్తులను డైరెక్ట్ టు కన్జ్యూమర్ వేదిక అయిన అజియోగ్రామ్‌లో అందుబాటులో ఉంచనుంది. భారతీయ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ విభాగంలోని 200 బ్రాండ్స్‌ను ఎక్స్‌క్లూజివ్‌గా అజియోగ్రామ్‌లో వచ్చే ఏడాదికల్లా చేర్చనున్నట్లు వెల్లడించింది. ఈ బ్రాండ్స్ విస్తరణకు, ఆదాయ వృద్ధికి పూర్తి సహకారం అందించనున్నట్లు అజియో ప్రకటించింది.

దాతృత్వంలో శివ్ నాడార్ టాప్

- రూ. 2,042 కోట్ల విరాళం
- ఎడెల్‌గివ్ హురున్ ఇండియా లిస్టులో అగ్రస్థానం



ముంబై: విరాళాలివ్వడంలో ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చీఫ్ శివ్ నాడార్ మరోసారి తన ఉదారత చాటుకున్నారు. 2023లో ఏకంగా రూ. 2,042 కోట్లు విరాళమిచ్చి ఎడెల్‌గివ్ హురున్ ఇండియా 2023 జాబితాలో అగ్రస్థానంలో నిల్చారు. గతేడాది ఇచ్చిన రూ. 1,161 కోట్లతో పోలిస్తే ఇది 76 శాతం అధికం. విప్రో అధినేత అజీమ్ ప్రేమ్‌జీ రూ. 1,774 కోట్లతో (గతేడాదితో పోలిస్తే 267 శాతం అధికం) రెండో స్థానంలోనూ, రూ. 376 కోట్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముకేశ్ అంబానీ మూడో స్థానంలో ఉన్నారు. అంబానీ విరాళాలు గతేడాదితో పోలిస్తే 8 శాతం తగ్గాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ చీఫ్ కుమార మంగళం బిర్లా రూ. 287 కోట్లతో నాలుగో స్థానంలో, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ రూ. 285 కోట్లతో (50 శాతం అధికం) ఈ జాబితాలో అయిదో స్థానంలో ఉన్నారు. ఇటీవలి హురున్ కుబేరుల జాబితా ప్రకారం అంబానీ సంపద రూ. 8.08 లక్షల కోట్లుగాను, అదానీది రూ. 4.74 లక్షల కోట్లు, నాడార్ సంపద రూ. 2.28 లక్షల కోట్లుగాను ఉంది. సంపద పెరిగే కొద్దీ సంపన్న కుటుంబాలు .. అట్టడుగు వర్గాల వారి కోసం ఆహారం, దుస్తులు, ఉపకార వేతనాలు మొదలైన దాతృత్వ కార్యకలాపాలకు విరాళాలిచ్చే ధోరణి పెరుగుతోందని హురున్ ఇండియా చీఫ్ రీసెర్చర్ అనాస్ రెహ్మాన్ జునైద్ తెలిపారు. లిస్టులో మొత్తం 119 మంది వ్యక్తులు, కుటుంబాలు ఉన్నాయి.

మరిన్ని వివరాలు..

- బజాజ్ కుటుంబంతో పాటు సైరస్ ఎస్ పూనావాలా, అదార్ పూనావాలా, రోహిణి నీలేకని వంటి వారు టాప్ 10లో నిల్చారు. మహిళల్లో నీలేకనితో పాటు అను ఆగా (థర్మాక్స్), లీనా గాంధీ తివారీ (యూఎస్‌వీ) కూడా ఉన్నారు.
- డిస్కౌంటు బ్రోకరేజీ జిరోధా సహ-వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ ఈ జాబితాలో అత్యంత పిన్న వయస్కుడు. కామత్ సోదరులు రూ. 110 కోట్లు విరాళమిచ్చారు.
- రూ. 150 కోట్ల విరాళంతో ఎల్అండ్‌టీ గౌరవ చైర్మన్ ఏఎం నాయక్ .. ప్రొఫెషనల్స్ జాబితాలో అగ్రస్థానంలో, ఓవరాల్ లిస్టులో 11వ స్థానంలో ఉన్నారు.

గెయిల్‌కు బీపీసీఎల్ ముడిసరుకు సరఫరా

రూ. 63,000 కోట్ల ఒప్పందం

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో నెలకొల్పుతున్న పెట్రోకెమికల్ ప్లాంటుకు అవసరమైన ముడిసరుకు కోసం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్)తో గెయిల్ (ఇండియా) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ. 63,000 కోట్లు. దీని ప్రకారం 15 ఏళ్ల పాటు గెయిల్‌కు చెందిన ఉసార్ ప్లాంటుకు బీపీసీఎల్ తమ ఎల్‌పీజీ దిగుమతి కేంద్రం నుంచి ఏటా 6 లక్షల టన్నుల ప్రొపేన్ గ్యాస్‌ను సరఫరా చేయనుంది. ఉసార్‌లో 5,00,000 టన్నుల సామర్థ్యంతో గెయిల్ దేశీయంగా తొలి ప్రొపేన్ డీహైడ్రోజినేషన్ (పీడీహెచ్) ప్లాంటును నిర్మిస్తోంది. ఈ ప్లాంటు 2025 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఫర్నిచర్ ఉపకరణాలు, బొమ్మలు మొదలైన వాటిలో ఉపయోగించే పాలీప్రొపిలీన్ తయారీ ప్లాంటుకు ఇది అనుసంధానమై ఉంటుంది.

మార్కెట్‌కు 'ఫెడ్' బూస్ట్!

- ఫెడరల్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీ రేట్లు యథాతథం
- కలిసొచ్చిన ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో జోష్
- 490 పాయింట్లు పెరిగి 64 వేల స్థాయి పైకి సెన్సెక్స్
- 144 పాయింట్ల లాభంతో 19,100 పైకి నిఫ్టీ

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఊహించినట్లే యథాతథంగా ఉంచడంతో పాటు సరళతర ద్రవ్య విధాన అమలు వ్యాఖ్యలు ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు నింపాయి. దేశీయంగా వాహన విక్రయాలు రికార్డు గరిష్టానికి చేరుకోవడం, జీఎస్‌టీ వసూళ్లు పెరగడం, కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు మెప్పించడం కలిసొచ్చాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 490 పాయింట్లు పెరిగి 64,081 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 144 పాయింట్లు బలపడి 19,133 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం భారీ లాభాల్లో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు ఆద్యంతం జోరు కనబరిచాయి. ఒకదశలో సెన్సెక్స్ 611 పాయింట్లు దూసుకెళ్లి 64,203 వద్ద, నిఫ్టీ 186 పాయింట్లు బలపడి 19,175 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. రియల్టీ, ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా షేర్లకు చిన్న, మధ్య తరహా షేర్లు భారీ డిమాండ్ లభించింది. దీంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు ఒకశాతానికి పైగా ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,261 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1380 కోట్ల షేర్లు కొన్నారు. ఫెడ్ రిజర్వ్ నుంచి సానుకూల సంకేతాలు, జపాన్ ప్రభుత్వం 113 బిలియన్ డాలర్ల ఉద్దీపన ప్యాకేజీకి ప్రకటన, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ సైతం వడ్డీరేట్ల జోలికెళ్లకపోవడం తదితర పరిణామాలతో ఆసియా, యూరప్ మార్కెట్లు 1-2% ర్యాలీ చేశాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు 1-1.5 శాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.



- సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3.1 లక్షల కోట్లు పెరిగి రూ. 313.32 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 షేర్లలో టెక్ మహీంద్రా(1%), బజాజ్ ఫైనాన్స్(0.25%) మాత్రమే నష్టపోయాయి.
- క్యూ2 నికర లాభం ఐదు రెట్లు వృద్ధి సాధించడంతో జేకే టైర్ షేరు 10% లాభపడి రూ.337 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 14% ర్యాలీ చేసి రూ.351 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- క్యూ2 ఫలితాల ప్రకటన తర్వాత హీరో మోటో కార్ప్ షేరులో లాభాల స్వీకరణ జరిగింది. 1% నష్టపోయి రూ.3050 వద్ద స్థిరపడింది.

లాభాల్లోకి టాటా మోటార్స్

- క్యూ2లో రూ. 3,783 కోట్లు
- జేఎల్ఆర్ అమ్మకాలు జూమ్



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్(క్యూ2)లో రూ. 3,783 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది (2022-23) ఇదే కాలంలో రూ. 1,004 కోట్ల నికర నష్టం ప్రకటించింది. బ్రిటిష్ లగ్జరీ కార్ల అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) పనితీరు లాభాలకు దోహదపడింది. వెరసి వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ లాభాలను ప్రకటించగలిగింది. ఆదాయం రూ. 79,611 కోట్ల నుంచి రూ. 1,05,128 కోట్లకు దూసుకెళ్లింది. ఇక స్టాండెలోన్ ప్రాతిపదికన సైతం రూ. 1,270 కోట్ల నికర లాభం సాధించగా.. గతేడాది క్యూ2లో రూ. 293 కోట్ల నికర నష్టం నమోదైంది.

ఇకపై మరింత దూకుడు: తాజా సమీక్షా కాలంలో జేఎల్ఆర్ ఆదాయం 30 శాతం జంప్ చేసి 6.9 బిలియన్ పౌండ్లకు చేరింది. హోల్‌సేల్ అమ్మకాలు, కొత్త ప్రొడక్టులు, వ్యయ నియంత్రణలు, డిమాండుకు అనుగుణమైన పెట్టుబడులు ఇందుకు సహకరించాయి. కాగా.. ఈ ఏడాది ద్వితీయార్ధం(అక్టోబర్-మార్చి)లో హోల్‌సేల్ అమ్మకాలు క్రమంగా జోరందుకోనున్నట్లు కంపెనీ అంచనా వేస్తోంది. నిర్వహణ(ఇబిట్) మార్జిన్లు గత 6 శాతం అంచనాలకంటే అధికంగా 8 శాతాన్ని తాకవచ్చని భావిస్తోంది. ఈ ఏడాది 2 బిలియన్ పౌండ్ల ఫ్రీ క్యాష్‌ఫ్లోను సాధించగలదని ఆశిస్తోంది. వెరసి మార్చికల్లా నికర రుణ భారం బిలియన్ పౌండ్లకంటే దిగువకు చేరవచ్చని అభిప్రాయపడింది.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు 1.5% బలపడి రూ. 637 వద్ద ముగిసింది.

దండారీ ఉత్సవాలు షురూ

- పద్మల్‌పూరి కాకో ఆలయం ముస్తాబు
- ఆలయానికి గిరిజన భక్తుల తాకిడి



పద్మల్‌పురి కాకో ఆలయం వద్ద గుస్సాడీలు, గిరిజన భక్తులు



కొలువుదీరిన పద్మల్‌పురి కాకో

దండేపల్లి: తెలుగు రాష్ట్రాల్లోనే ఏకైక ఆలయంగా ప్రసిద్ధి చెందిన దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి ఒడ్డున ఉన్న ఆదివాసీల ఆరాధ్య దైవం పద్మల్‌పూరి కాకో ఆలయంలో దండారీ ఉత్సవాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రతియేటా ఆశ్వీయుజ పౌర్ణమి తర్వాత ప్రారంభమయ్యే ఉత్సవాలు దీపావళి అమావాస్యతో ముగుస్తాయి. జిల్లాతోపాటు నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాలు, రాష్ట్రంలోని పలు ప్రాంతాలు, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి ఆదివాసీ గిరిజనులు ఆలయానికి యేటా వస్తుంటారు. ఈసారీ ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆయా ప్రాంతాల నుంచి ఆదివాసీలు తరలి రానున్నారు.

ఆదివాసీల ఆరాధ్యదైవం

పద్మల్‌పూరి కాకో అమ్మవారు ఆదివాసీ గోండు, ప్రదాన్, కొలాం, తోటి గిరిజనులకు ఆరాధ్యదైవం. దసరా తర్వాత ఆలయం వద్ద జరిగే ఉత్సవాలకు కుటుంబ సమేతంగా వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. విందు వంటకాలు చేసుకుని పంక్తి భోజనాలు చేస్తారు.

ప్రత్యేక నైవేద్యాలు

అమ్మవారికి పాయసంతోపాటుగా రుబ్బిన పెసరు, మినుము, బబ్బెర గారెలు నైవేద్యంగా సమర్పిస్తారు. వీటిని గానుగతో తయారు చేసిన నువ్వులు, పల్లి నూనె వేసి తయారు చేస్తారు. వీటితోపాటు దంచిన బియ్యంతో తయారు చేసిన అరిసెలు కూడా నైవేద్యంగా పెడతారు. వీటికి సంబంధించిన ధాన్యాన్ని అరచేతితో కొలుస్తారు. మరికొందరు కోళ్లు, మేకలు కూడా బలి ఇస్తారు.

అలరించే గుస్సాడీల నృత్యాలు..

ఆలయం వద్ద నిర్వహించే దండారీ ఉత్సవాల్లో గుస్సాడీల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. నెత్తిన నెమలి పింఛంతో తయారు చేసిన టోపి, కళ్లకు అద్దాలు, భుజాన జింక తోలు, నడుము, కాళ్లకు గజ్జెలు ధరించి చేతిలో కోలా పట్టుకుని గిరిజన వాయిద్యాలు, డప్పు చప్పుళ్లకు గుస్సాడీలు చేసే నృత్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటాయి.

భజనలు

ఆలయం వద్ద దండారీ ఉత్సవాలు ముగిసే వరకు ప్రతీ రోజు గిరిజనులు ప్రత్యేక భజనలు చేస్తారు. గిరిజన భాషల్లో పాటలు పాడుతూ ఆలయం వద్ద రాత్రి పగలు తేడా లేకుండా కొనసాగిస్తారు. దీంతో ఆలయం వద్ద ఉత్సవాలు ముగిసేదాకా సందడిగా నెలకొంటుంది.

పద్మశాలీల ఆత్మగౌరవాన్ని చాటుదాం



సిరిసిల్ల సభలో మాట్లాడుతున్న పత్తిపాక సురేశ్



ఆత్మగౌరవ సభకు హాజరైన పద్మశాలీలు

- కార్పొరేషన్లకు విధులు.. నిధులు లేవు
- సిరిసిల్లలో పద్మశాలీలు ఎమ్మెల్యే కావాలి
- చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్

సిరిసిల్ల: రాష్ట్రంలోని పద్మశాలీలు అందరూ సిరిసిల్ల వైపు చూస్తున్నారని పద్మశాలి అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించుకుని మన ఆత్మగౌరవాన్ని చాటిచెప్పాలని చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని లహరీ గ్రాండ్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం పద్మశాలీల ఆత్మగౌరవ సభ జరిగింది. ఈ సందర్భంగా వీరమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ పోటీచేసినా కేటీఆర్ గెలుస్తారని, ఆయన ఎక్కడైనా పోటీ చేయొచ్చని, స్థానికులైన పద్మశాలీలను సిరిసిల్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఆర్ఎస్ పార్టీ ప్రకటించాలని కోరారు. మునుగోడు ఎన్నికల నేపథ్యంలో టెక్స్‌టైల్, చేనేత కార్పొరేషన్లను ఏర్పాటు చేసి చైర్మన్లను నియమించినా.. ఆ కార్పొరేషన్లకు విధులు లేవు.. నిధులు లేవని వీరమోహన్ ఆరోపించారు. పద్మశాలీలపై కేటీఆర్‌కు ప్రేమలేదని, అంతా కపట ప్రేమ అని విమర్శించారు. పద్మశాలీలు ఇప్పటికైనా ఏకమై ఏ పార్టీతో సంబంధం లేని పత్తిపాక సురేశ్‌ను గెలిపించుకోవాలని కోరారు. పద్మశాలి జేఏసీ వ్యవస్థాపకుడు వాసాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సిరిసిల్లలో పద్మశాలి సమాజం చాలా పెద్దదని, వారి ఆత్మగౌరవాన్ని దొరల కాళ్ల వద్ద తాకట్టు పెడుతున్నారన్నారు. బతుకమ్మ చీరలతో బతికిందెవరో అందరికీ తెలుసునన్నారు. పద్మశాలీలు ఇక్కడ ధైర్యంగా బతకడం లేదని, బానిసల్లా బతుకుతున్నారన్నారన్నారు. 60 ఏళ్లుగా ఒక్క పద్మశాలి నాయకుడు ఇక్కడ ఎమ్మెల్యే కాకపోవడం సిగ్గుచేటన్నారు. ఒకప్పుడు సిరిసిల్లలో ఆత్మహత్యలు ఎక్కువగా జరిగేవని, ఇప్పుడు అందరూ శవాల్లా జీవిస్తున్నారని విమర్శించారు. సిరిసిల్ల సభకు రావొద్దని పలువురు బీఆర్ఎస్ నాయకులు ఫోన్లు చేశారని, ఆత్మగౌరవ సభకు వాళ్ల పర్మిషన్ ఏంటీ.. అని వచ్చినట్లు ఆయన వెల్లడించారు. యువ యుద్ధనౌక పత్తిపాక సురేశ్ మాట్లాడుతూ మీ బిడ్డగా ఒక్క చాన్స్ ఇవ్వాలని కోరారు. గెలిస్తే.. మీకు నచ్చినట్లు పని చేయకుంటే.. అందుబాటులో ఉండకుంటే.. రెండేళ్లలో రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో చేనేత ఐక్యవేదిక హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు ఆర్.వేదశ్రీ, పద్మశాలి సంఘం నాయకులు జక్కని సంజయ్, పత్తిపాక పద్మ-శంకర్, గుడ్ల వెంకన్న, గున్నాల దేవదాస్, రాపెల్లి ఆనందం, సామల రాము, డాక్టర్ మిట్టపల్లి రాజమౌళి, రాపెల్లి రమేశ్, మోర శ్రీకాంత్, మచ్చ శ్రీనివాస్, పత్తిపాక రోహిణి, గుజ్జె తార, ఎనగందుల రూప తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుల నియామకం

- ఉమ్మడి జిల్లాకు ఆరుగురు ఐఏఎస్, నలుగురు ఐపీఎస్‌లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎన్నికల తీరును ఎప్పటికప్పుడు పరిశీలన చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక అధికారులను నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఐఏఎస్ స్థాయి అధికారులకు సాధారణ పరిశీలకులుగా, ఐపీఎస్ అధికారులను పరిశీలకులుగా పంపింది. పలు రాష్ట్రాలకు చెందిన సివిల్ సర్వీసెస్ అధికారులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నియోజకవర్గాల్లో ఎన్నికల సందర్భంగా పర్యటిస్తూ ప్రతీది గమనిస్తుంటారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు సజావుగా సాగడానికి, అధికారులు నిష్పక్షపాతంతో పని చేసేలా, స్థానిక అధికారుల తోపాటు, పోటీలో ఉన్న అభ్యర్థుల తీరును గమనిస్తుంటారు. విధుల్లో ఏమైనా ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటారు. ఇందుకోసం ప్రత్యేకంగా జిల్లా ఎన్నికల అధికారి ఫోన్ నంబర్లు కూడా ఈ అధికారులకు అందుబాటులో ఉంచుతారు. క్షేత్రస్థాయిలో రోజువారీగా పరిశీలిస్తూ ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తారు. ఈ నెల 10న నామినేషన్ల ప్రక్రియ ముగిశాక విధులు ప్రారంభించి పోలింగ్ పూర్తయ్యే 30వరకు పరిశీలకులుగా వ్యవహరిస్తారు.

సాధారణ పరిశీలకులు	కేటాయించిన నియోజకవర్గం
రాహుల్ రంజన్ మహివాల్	సిర్పూర్, ఆసిఫాబాద్
సజ్జన్ ఆర్	చెన్నూరు,
బిశ్వజిత్ దుత్తా	బెల్లంపల్లి, మంచిర్యాల
జి.బి.పాటిల్	ఆదిలాబాద్, బోథ్
గోపాల కిషన్ కె	ఖానాపూర్
రవిరంజన్‌కుమార్ విక్రమ్	నిర్మల్, ముథోల్
పోలీసు పరిశీలకులు	**కేటాయించిన నియోజకవర్గం**
డాక్టర్ డీకే.చౌదరీ	సిర్పూర్, ఆసిఫాబాద్
ఇల్లంగో ఆర్	చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల
అశోక్ గోయల్	ఆదిలాబాద్, బోథ్
లక్ష్మణ్ నింబార్గి	ఖానాపూర్, నిర్మల్, ముథోల్

జాతీయ సదస్సులో ట్రిపుల్‌ఐటీ వీసీ



సదస్సుకు హాజరైన వీసీలు

భైంసా: దేశ రాజధాని న్యూఢిల్లీలో గురువారం నిర్వహించిన జాతీయ సదస్సులో బాసర ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ నీతి అయోగ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను విస్తరించే అంశంపై సదస్సు నిర్వహించారు. 22 రాష్ట్రాల నుంచి 60 మంది వీసీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సదస్సులో ట్రిపుల్‌ఐటీ వీసీ వెంకటరమణ పలు సూచనలు చేశారు. విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించేందుకు ఇలాంటి వేదికలు ఉపయోగపడతాయన్నారు. హయ్యర్ ఎడ్యుకేషన్ ఫైనాన్సింగ్, యూనివర్సిటీల పాలన, సాంకేతిక విశ్వవిద్యాలయాలతో సహకారం తదితర అంశాలపై చర్చించారు.

అవగాహన ఒప్పందం...

ఈ సదస్సులో ట్రిపుల్‌ఐటీ బాసర, మేఘాలయాలోని సైన్స్‌అండ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయంలో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంలో రెండు విశ్వవిద్యాలయాలు ఉన్న ప్రయోగశాలలు సాంకేతిక కోర్సుల అభివృద్ధికి కావాల్సిన సహాయ సహకారాలను అందించుకోవాలని చర్చించారు. మేఘాలయ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ గౌరిధత్‌శర్మ, బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అవగాహన ఒప్పందం చేసుకున్నారు.

ఇంధన పొదుపుపై పెయింటింగ్ పోటీలు

- ఎన్టీపీసీ ఎస్ఆర్‌హెచ్‌క్యూ, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఆధ్వర్యంలో నిర్వహణ
- దరఖాస్తుకు 6 వరకు గడువు

జ్యోతినగర్(పెద్దపల్లి): ఇంధన పొదుపుపై జాతీయ పెయింటింగ్ పోటీలను కేంద్ర ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ సహకారంతో ఎన్టీపీసీ సదరన్ రీజియన్ హెడ్ క్వార్టర్స్, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు స్టేట్ నోడల్ అధికారులు బద్రుద్దీన్ అన్సారీ, ప్రియాంక భయాన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది గొప్ప అవకాశమని, రాష్ట్ర విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

రెండు గ్రూపులుగా నిర్వహణ

జాతీయ స్థాయి పెయింటింగ్ పోటీలను ఏ, బీ గ్రూపులుగా విభజించి నిర్వహించనున్నారు. ఏ-గ్రూపులో 5, 6, 7 తరగతులు, బీ-గ్రూపులో 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అవకాశం కల్పించారు. పోటీలు రాష్ట్ర/కేంద్ర పాలిత, జాతీయ స్థాయిల్లో జరగనున్నాయి. ఆసక్తి గలవారు ఈ నెల 6వ తేదీలోపు www.bee-studentsaward.in లో దరఖాస్తు చేసుకోవాలి.

ఈ అంశాలపై పోటీలు..

లైఫ్-పర్యావరణహిత జీవనశైలి లేదా మనం-భూగ్రహ అనుకూల ప్రజలం.



పెయింటింగ్ పోటీల లోగో

అవార్డు గ్రహీతకు శుభాకాంక్షలు



రామగుండం: రామగుండం పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం విధులు నిర్వహించిన కోట వెంకటశివశాస్త్రి వేలాది మంది పూర్వ విద్యార్థులు, స్థానికులకు సుపరిచితుడు. ఈ నేపథ్యంలో గుంటూరులో నివాసముంటున్న వెంకటశివశాస్త్రి తండ్రి ప్రసిద్ధ హరికథ విద్వాంసులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోట సచ్చిదానందశాస్త్రి దేశ వ్యాప్తంగా 1500 పైగా హరికథ ప్రదర్శనలిచ్చారు. ఈ క్రమంలో తన కళను గుర్తించి ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడలోని ఏ-కన్వెన్షన్ సెంటర్‌లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేశారు. కాగా గురువు తండ్రి అవార్డు స్వీకరించడంపై పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ పూర్వ ఉపాధ్యాయుడు వెంకటశివశాస్త్రికి అభినందనలు తెలిపారు.

V
సాక్షి ఫ్యామిలీ
నిజామాబాద్
శుక్రవారం ॥ 3-11-2023

● టెక్.. టాక్

హువావే నోవా 11 ఎస్ఈ



సైజ్: 6.67 అంగుళాలు; రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్
బరువు: 186 గ్రా. బ్యాటరీ: 4500 ఎంఏహెచ్
కలర్స్: గ్రీన్, వైట్, బ్లాక్ ● 5జీ కనెక్టివిటీ రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జడ్

లెనోవా ట్యాబ్ పీ12



సైజ్: 12.7 అంగుళాలు
రిజల్యూషన్: 1840×2944
వోఎస్: ఆండ్రాయిడ్ 13 కలర్స్: స్టోర్మ్ గ్రే, ఓట్
ఇంటర్నల్: 128జీబీ 4జీబీ ర్యామ్ / 128జీబీ 8జీబీ ర్యామ్ / 256 జీబీ 8జీబీ ర్యామ్
బరువు: 615 గ్రా. బ్యాటరీ: 10200 ఎంఏహెచ్

పోట్రానిక్స్ స్క్రీన్ క్లీనర్



బ్రాండ్: పోట్రానిక్స్ కలర్: బ్లూ
మెటీరియల్: ప్లష్ బరువు: 50 గ్రా.
కంపాటబుల్ డివైజెస్: మానిటర్, ట్యాబ్లెట్ స్క్రీన్, స్మార్ట్ ఫోన్స్

గూగుల్ పాస్‌కీస్

ఆండ్రాయిడ్ డివైజ్‌ల కోసం సెర్చ్ ఇంజన్ దిగ్గజం గూగుల్ సరికొత్త క్రెడెన్షియల్ మేనేజర్‌ను తీసుకు రానుంది. 'పాస్ కీస్' ద్వారా ఈ టూల్ మన లాగిన్ అవసరాలకు ఉపయోగపడుతుంది. ఆన్‌లైన్ ఎకౌంట్స్‌లో లాగిన్ కావడానికి ఇదో కొత్త విధానం. దీని ద్వారా యూజర్‌లు పాస్‌వర్డ్ ఉపయోగించకుండానే వెబ్‌సైట్‌లు, అప్లికేషన్‌లలో లాగిన్ కావచ్చు. రైట్ అథంటికేషన్ మెథడ్ ద్వారా క్రెడెన్షియల్ మేనేజర్ 'పాస్‌కీస్' మరో లెవెల్‌కు తీసుకువెళ్లనుంది.



ఇన్‌స్టాలో ఇంటర్నెట్ యాక్టివిటీ ట్రాకింగ్ స్టాప్ చేయడానికి...




● ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రొఫైల్ పిక్చర్ టాప్ చేయాలి
● టాప్ రైట్ కార్నర్‌లో ఉన్న మూడు హారిజంటల్ లైన్స్‌ను టాప్ చేయాలి
● సెట్టింగ్ అండ్ ప్రైవసీ-సెలెక్ట్
● ట్యాప్-యాక్టివిటీ
● ట్యాప్-యాక్టివిటీ ఆఫ్ మెటా టెక్నాలజీస్
● ట్యాప్-డిస్‌కనెక్ట్ ఫ్యూచర్ యాక్టివిటీ

అడ్వాన్స్‌డ్ డాటా ఎనాలసిస్



చాట్‌బాట్ కోసం 'అడ్వాన్స్‌డ్ డాటా ఎనాలసిస్' అనే కొత్త ఫీచర్ గురించి ప్రకటించింది ఓపెన్ ఏఐ. దీని ద్వారా యూజర్‌లు పీడీఎఫ్ ఫైల్స్, డాటా ఫైల్స్, ఇతర ఫైల్స్ అప్‌లోడ్, ఎనాలసిస్ చేసుకోవచ్చు. ప్రస్తుతం ఇది బీటా దశలో ఉంది. సుదీర్ఘమైన డాక్యుమెంట్‌ల నుంచి సంక్షిప్త సమాచారం, రకరకాల డాటా పాయింట్స్‌ను అర్థం చేసుకోవడానికి, డాటా ఆధారంగా గ్రాఫ్స్ అండ్ చార్ట్స్ జనరేట్ చేయడానికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.

● సక్సెస్ స్టోరీ



ప్రమోద్ గాడ్గే

'భవిష్యత్ అనేది రకరకాల వస్తువులతో కూడిన బాక్స్‌లాంటిది. మనం తీసినప్పుడు ఏ వస్తువు చేతికందుతుందో తెలియదు. కొన్నిసార్లు నిరాశపరిచే వస్తువు, కొన్నిసార్లు అత్యంత విలువైన వస్తువు చేతికి అందవచ్చు'... ఈ సినిమా డైలాగ్‌ను ప్రమోద్ గాడ్గే, షాహీద్ మెమన్‌లు విన్నారో లేదో తెలియదుగానీ 'అన్‌బాక్స్' రూపంలో వారికి బాక్స్ నుంచి విలువైన కానుక లభించింది. తమ భవిష్యత్‌నే మార్చేసిన స్టార్టప్ కానుక అది.
లాజిస్టిక్ ఆటోమేషన్ స్టార్టప్ 'అన్‌బాక్స్ రోబోటిక్స్'తో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్నారు ప్రమోద్, షాహీద్‌లు...



షాహీద్ మెమన్

అన్‌బాక్స్ అదరగొట్టారు

'మన దేశంలో ఇ-కామర్స్ వేగం పెరిగింది' అనే వార్త చదివి 'ఓహో అలాగా!' అనుకోవచ్చు. అద్భుతమైన 'ఐడియా' కూడా రావచ్చు. ఆ ఐడియా జీవితాన్నే మార్చేయవచ్చు. ప్రమోద్ గాడ్గే, షాహీద్ మెమన్‌ల విషయంలో జరిగింది ఇదే. మన దేశంలో ఇ-కామర్స్ స్పీడ్‌ను గమనించిన వీరు సప్లై చైన్ రోబోటిక్స్ స్టార్టప్ 'అన్‌బాక్స్ రోబోటిక్స్'తో విజయపథంలో దూసుకుపోతున్నారు. ఇండియా దాటి యూఎస్, యూరప్ మార్కెట్‌లోకి కూడా అడుగు పెట్టనున్నారు.

పుణే కేంద్రంగా మొదలైన 'అన్‌బాక్స్ రోబోటిక్స్' సప్లై చైన్ ఆటోమేషన్ సోల్యూషన్స్‌లో మార్పు తీసుకువచ్చింది. వినూత్న ఏఐ-ఆధారిత కంట్రోల్ సిస్టమ్ ద్వారా రోబోట్‌ల ఉత్పాదకతను పెంచింది. పనితీరును మార్చింది.

'మానవ శక్తి నుంచి రోబోట్స్ వరకు ప్యాకేజీలను క్రమబద్ధీకరించడం, రవాణా చేయడం... మొదలైన విధానాలు మన దేశంలో ఇ-కామర్స్ వేగాన్ని అందుకోలేకపోతున్నాయేమో అనిపించింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని మొబైల్ రోబోటిక్స్ సిస్టమ్‌ను నిర్మించాలనుకున్నాం. లాజిస్టిక్స్, రిటైల్ ప్లేయర్‌ల కోసం ప్యాకేజీ సార్టింగ్, ఆర్డర్ కన్సాలిడేషన్ ప్రక్రియలను ఆటోమేట్ చేయడానికి శక్తిమంతమైన రోబోటిక్స్ వ్యవస్థను నిర్మించాలనుకున్నాం' గతాన్ని గుర్తు తెచ్చుకుంటాడు 'అన్‌బాక్స్ రోబోటిక్స్' సీఇవో ప్రమోద్ గాడ్గే.

'అన్‌బాక్స్ రోబోటిక్స్'కు ముందు ఫ్లిప్‌కార్ట్‌లో సార్టింగ్‌కు సంబంధించి ఆటోమేషన్ విభాగంలో, మన దేశంలోని తొలి రోబోట్-బేస్డ్ సార్టింగ్ ప్రాజెక్ట్‌లో పనిచేశాడు ప్రమోద్.

'అన్‌బాక్స్ రోబోటిక్స్' కో-ఫౌండర్, సీటీవో షాహీద్ రోబోటిక్స్, ఇంటెలిజెన్స్ సిస్టమ్స్, స్వార్మ్ ఇంటెలిజెన్స్‌లో మంచి అనుభవం ఉంది. రోబోటిక్స్, ఆటోమేషన్ ఫీల్డ్స్‌లో సీటీవోగా పనిచేశాడు.

'అన్‌బాక్స్'కు ముందు 'వనోర రోబోట్స్' అనే స్టార్టప్ ప్రారంభించాడు.

చిత్తశుద్ధి, కష్టపడే తత్వం, అంకితభావం లేకపోతే పేపర్ మీద రాసుకున్న కాన్సెప్ట్ అక్కడే నిలిచిపోతుంది. అయితే ఈ ఇద్దరు మిత్రులు వారి బృందం బాగా కష్టపడి 'అన్‌బాక్స్'ను సూపర్ హిట్ చేశారు.

స్టార్టప్ కాన్సెప్ట్‌లో సత్తా ఉంటే ఇన్వెస్టర్‌లు వెనకడుగు వేయరు. 'అన్‌బాక్స్' విషయంలోనూ అదే జరిగింది. టీమ్‌ను విస్తరించడానికి, అంతర్జాతీయ స్థాయిలో కస్టమర్‌ల డిమాండ్‌ను నెరవేర్చడానికి, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై సమీకరించిన నిధులను వాడారు.

స్టార్టప్ కాన్సెప్ట్‌లో సత్తా ఉంటే ఇన్వెస్టర్‌లు వెనకడుగు వేయరు. 'అన్‌బాక్స్' విషయంలోనూ అదే జరిగింది.



2021లో థర్డ్-పార్టీ లాజిస్టిక్స్, ఇ-కామర్స్ ప్లేయర్స్‌తో కంపెనీ బీటా పైలట్స్ లాంచ్ చేసినప్పుడే లీడింగ్ ఇ-కామర్స్ లాజిస్టిక్స్ కంపెనీల నుంచి ఆర్డర్లు రావడం మొదలైంది. ఇది భవిష్యత్ విజయానికి సూచికలా పనిచేసింది. ఇన్వెస్టర్‌లలో మరింత నమ్మకాన్ని నింపింది.

'అన్‌బాక్స్' స్టార్టప్ ఇ-కామర్స్, లాజిస్టిక్స్, రిటైల్‌లాంటి సెక్టార్‌లలో ఏడు పెద్ద సంస్థలతో కలిసి పనిచేస్తోంది. క్లయింట్ సబ్‌స్క్రిప్షన్ మోడల్ 'రోబోట్ యాజ్ ఏ సర్వీస్'ను కూడా కంపెనీ ప్రారంభించింది.

ఇ-కామర్స్, లాజిస్టిక్స్, రిటైల్ రంగాలకు సంబంధించి రోబోటిక్-బేస్డ్ ఫుల్‌ఫిల్‌మెంట్, డిస్ట్రిబ్యూషన్ టెక్నాలజీలో ప్రత్యేకత సాధించిన 'అన్‌బాక్స్ రోబోటిక్స్' అంతర్జాతీయ స్థాయిలోనూ సత్తా చాటుతుంది.

● గేమింగ్



అగ్గిబరాట

అడ్వెంచర్ వీడియో గేమ్ 'థ్రస్టీ సూటర్స్' విడుదల అయింది. యంగ్ లేడీ జాల తన సోదరి వివాహం సందర్భంగా స్వస్థలానికి వస్తుంది. ఆ తరువాత ఏమైంది అనేది ఈ గేమ్. సంస్కృతి, భావోద్వేగాలు, కుటుంబ ఒత్తిళ్లు, బంధాలకు ఈ గేమ్ కేంద్రబిందువు. సినిమాటిక్, టర్న్-బేస్డ్ బ్యాటిల్ సీక్వెన్స్‌లు ఉంటాయి.

గేమ్ ప్లే: కంబాట్, స్కేట్ బోర్డింగ్, కుకింగ్
జానర్స్: రోల్-ప్లేయింగ్ గేమ్, అడ్వెంచర్ గేమ్, యాక్షన్ గేమ్, అడ్వెంచర్
ప్లాట్‌ఫామ్స్: ప్లే స్టేషన్ 5, నిన్‌టెండో స్విచ్, ఎక్స్ బాక్స్ వన్, ప్లే స్టేషన్ 4, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్, సిరీస్ ఎస్

యువర్స్

● ఇంగ్లిష్ ఇడియమ్స్

ఏ హెడ్‌స్టార్ట్

ఏదైనా విషయంలో, పోటీలో, పరీక్షలో....ఒక వ్యక్తికి అడ్వాంటేజ్ ఉంటే వాడే మాట... ఏ హెడ్‌స్టార్ట్.
ఉదా: మెర్లిన్స్ బ్యూటీ అండ్ నేచురల్ గ్రేస్ గేవ్ హర్ ఏ బిగ్ హెడ్‌స్టార్ట్ ఇన్ ది మోడలింగ్ అండ్ యాక్టింగ్

పాసింగ్ ది బక్

ఒక పనిలో తన రెస్పాన్సిబిలిటీని తప్పించుకోవడంలో భాగంగా నెపాన్ని ఇతరుల మీద నెట్టి బ్లేమ్ చేసే సందర్భంలో వాడే మాట...పాసింగ్ ది బక్.
ఉదా: డోన్ట్ ట్రై టు పాస్ ది బక్- దిస్ ఈజ్ యువర్ రెస్పాన్సిబిలిటీ, నాట్ మైన్.

● మ్యూజిక్ వరల్డ్

సంగీతమే శ్వాసగా...

కోల్‌కతాకు చెందిన సింగర్, సాంగ్ రైటర్ అమిక శైల్. తొమ్మిది సంవత్సరాల వయసులో 'లిటిల్ చాంప్స్' రియాలిటీ షోలో పాల్గొంది. ఫోక్, జాజ్, క్లాసిక్‌లో 'వావ్' అనిపించుకుంది. డిగ్రీ పూర్తయిన తరువాత తన కలను సాకారం చేసుకోవడానికి ముంబైకి వచ్చింది. 'స్ట్రగుల్' అంటే ఏమిటో అప్పుడే తెలిసింది. సినిమాల్లో పాడడానికి చేసే ప్రయత్నాలు విఫలం అవుతున్నాయి. హిందుస్థానీ క్లాసిక్ మ్యూజిక్‌లో అమికకు మంచి పట్టు ఉంది. అవకాశాలు వచ్చే వరకు ఖాళీగా కూర్చోవడం ఎందుకని మ్యూజిక్ టీచర్‌గా జాబ్‌లో చేరింది. ఎట్టకేలకు 'వెడ్డింగ్ యానివర్సరీ' సినిమాతో బ్రేక్ వచ్చింది. ఎన్నో టీవీ సీరియల్స్‌కు టైటిల్ సాంగ్స్ పాడింది. ఎన్నో రియాల్టీ షోలలో పాల్గొంది. 'సంగీతం అనేది నాకు అభిరుచి కాదు శ్వాస లాంటిది. సంగీత సాధనకు ఎన్ని గంటలైనా సరిపోవు. యాంత్రికంగా, మొక్కుబడిగా కాకుండా ప్రశాంత చిత్తంతో సంగీత సాధన చేయాలి' అంటున్న అమిక నటిగా కూడా రాణిస్తోంది. 'పవర్‌ఫుల్ డైలాగులో చెప్పడంలో, సరియైన భావోద్వేగాలు ప్రదర్శించడంలో నాలోని సింగర్ గురువులా మార్గదర్శనం చేస్తోంది' అంటుంది అమిక శైల్.



అమిక శైల్



అమిక శైల్

సినిమా



● రామ్‌చరణ్

ఆస్కార్ యాక్టర్స్ బ్రాంచ్‌లో...

రామ్ చరణ్‌కి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. 'ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' (ఆస్కార్ కమిటీ) తాజాగా వెల్లడించిన 'మెంబర్ క్లాస్ ఆఫ్ యాక్టర్స్' జాబితాలో రామ్‌చరణ్‌కి సభ్యత్వం దక్కింది. 'ఆర్ఆర్ఆర్'లో రామరాజు పాత్రలో అద్భుతంగా నటించినందుకుగాను చరణ్‌కి ఈ స్థానం లభించింది. కాగా 'ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' ఆ మధ్య విడుదల చేసిన యాక్టర్స్ బ్రాంచ్‌లో తెలుగు నుంచి ఎన్టీఆర్‌కి చోటు దక్కిన విషయం తెలిసిందే. తాజాగా రామ్‌చరణ్‌తో పాటు మరికొందరు హాలీవుడ్ నటీనటులకు ఈ కమిటీలో చోటు దక్కింది. ''ఈ నటులు వెండితెరపై తమ ప్రతిభతో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించారు. వాస్తవానికి, కల్పితానికి మధ్య వారధులుగా నిలిచారు. ఎన్నో సినిమాల్లో వారి నటనతో పాత్రలకు ప్రాణం పోశారు. వారి కళతో సాధారణ సినిమాతో ప్రేక్షకులకు అసాధారణ అనుభవాలను అందిస్తున్నారు. అలాంటి వారిని 'యాక్టర్స్ బ్రాంచ్'లోకి ఆహ్వానిస్తున్నాం'' అని సోషల్ మీడియా వేదికగా ఆస్కార్ అకాడమీ ప్రతినిధులు షేర్ చేశారు. కాగా 96వ ఆస్కార్ అవార్డుల వేడుక వచ్చే ఏడాది మార్చిలో జరగనుంది.

చేయి పోయినా ఆత్మవిశ్వాసంతో సినిమా పూర్తి చేశాను

- సెబాస్టియన్ నోవా అకోస్టా

రక్షిత్ అట్లూరి హీరోగా నటించిన తాజా చిత్రం 'నరకాసుర'. సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకత్వంలో డా.అజ్జా శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో సెబాస్టియన్ నోవా మాట్లాడుతూ– ''దర్శకుడు కావాలనేది నా కల. ఓ ఫిల్మ్ స్కూల్‌లో శిక్షణ తీసుకుని అవకాశాల కోసం ప్రయత్నించినా కుదర్లేదు. టెక్నాలజీపై అవగాహన కోసం 2012లో ప్రసాద్ ల్యాబ్‌లో చేరాను. అక్కడ రిలీజ్‌కు నోచుకోని సినిమాలు కనిపించాయి. దీంతో సినిమా తీయడం కాదు.. తీసిన సినిమాను మార్కెట్ చేసుకోవడం ముఖ్యమని భావించి సాయి కొర్రపాటిగారి సహాయంతో డిస్ట్రిబ్యూషన్ రంగంలో చేరాను. ఆ తర్వాత నా దర్శకత్వంలో సినిమా కోసం కథ రెడీ చేసుకున్నాను. చిన్నతనంలో నేను తప్పిపోతే ట్రాన్స్‌జెండర్స్ నన్ను మా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కథకు ఈ సంఘటన ఓ స్ఫూర్తి. ఇక దర్శకుడిగా తొలి అవకాశమే కష్టం అనుకుంటే.. 'నరకాసుర' చిత్రీకరణ టైమ్‌లో ఒరిస్సాలో షూటింగ్ పూర్తి చేసుకుని జబల్‌పూర్ వెళ్తుంటే ప్రమాదం జరిగి, నా చేయి పోయింది. ప్రమాదం జరిగిన తర్వాత 27వ రోజు నేను సెట్స్‌లోకి వచ్చి, ఆత్మవిశ్వాసంతో సినిమాను పూర్తి చేశాను. ఇక మాధవన్, అరుణ్ విజయ్, వివేక్ ఒబెరాయ్, టొవినో థామస్ వంటి స్టార్స్‌తో ట్రైబల్ నేపథ్యంలో ఓ సినిమా ప్లానింగ్‌లో ఉంది. మూడు భాషల్లో చిత్రీకరిస్తాం'' అన్నారు.



మా వ్యూహం మాకుంది

- రామ్‌గోపాల్ వర్మ



● కిరణ్‌కుమార్, రామ్‌గోపాల్ వర్మ

''అరచేతిని అడ్డుపెట్టి సూర్య కాంతిని ఆపలేరు. అలాగే మా 'వ్యూహం' సినిమా విడుదలను కూడా ఆపలేరు. ఈలోగా మా సినిమాపై ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేయకుండా నేనే ముందుకొచ్చి మాట్లాడుతున్నా. ఒకవేళ మా చిత్రం రిలీజ్‌కి అడ్డంకులు సృష్టిస్తే ఏం చేయాలో మా వ్యూహం మాకుంది'' అని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ అన్నారు. అజ్మల్, మానస ప్రధాన పాత్రల్లో రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'వ్యూహం'. దాసరి కిరణ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా తొలి భాగం ఈ నెల 10న విడుదల కావాల్సి ఉంది. అయితే రిలీజ్‌ని వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ–''వ్యూహం' చూసిన సెన్సార్ సభ్యులు రివైజింగ్ కమిటీకి పంపిస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. ఎందుకు రివైజింగ్ కమిటీకి పంపిస్తున్నారో కారణాలు చెప్పలేదు. దీంతో ప్రస్తుతానికి సినిమా విడుదల వాయిదా వేస్తున్నాం. రివైజింగ్ కమిటీల్లోనూ తేల్చకుంటే 'ఉడ్తా పంజాబ్, పద్మావత్' వంటి హిందీ సినిమాలకు కోర్టు ద్వారా రిలీజ్ ఆర్డర్ తెచ్చుకున్నట్లే మేమూ తెచ్చుకుంటాం. చట్టపరంగా ఉన్న పద్ధతుల ద్వారా 'వ్యూహం'ను రిలీజ్ చేసుకుంటాం. ఈ సినిమా విడుదల ఆపాలని నారా లోకేశ్ సెన్సార్‌కు లేఖ రాసినట్లు తెలిసింది. అయితే అదెంత నిజమో చెప్పడానికి నా దగ్గర ఆధారాలు లేవు. మీడియా, సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలు చెప్పినట్లే 'వ్యూహం' ద్వారా నా అభిప్రాయాలు చెప్పాను. అది ఎవరైనా వింటారా? లేదా అన్నది అర్థం లేని ప్రశ్న. సినిమా ఇవ్వడం వరకే నా బాధ్యత'' అన్నారు. ''మా సినిమాను రివైజింగ్ కమిటీకి పంపినా నష్టం జరగదు. మేము అనుకున్నట్లే అన్నీ సకాలంలో జరుగుతాయని ఆశిస్తున్నాం. కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటిస్తాం''అన్నారు దాసరి కిరణ్ కుమార్.



హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్యా త్రిపాఠిల వివాహం ఇటలీలోని టస్కనీలో బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ వివాహానికి మెగా, అల్లు కుటుంబ సభ్యులతో పాటు అత్యంత సన్నిహితులు, స్నేహితులు హాజరయ్యారు. హీరో అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి, కుమారుడు అల్లు అయాన్, కుమార్తె అల్లు అర్హతో కలిసి వివాహానికి హాజరై వధూవరులకు అభినందనలు తెలిపారు.

లవ్ డ్యూయెట్

ఆనంద్ దేవరకొండ, రితికా నాయక్ జంటగా నటించనున్న సినిమాకు 'డ్యూయెట్' టైటిల్‌ను ఖరారు చేశారు. ఏఆర్ మురుగదాస్ దగ్గర అసిస్టెంట్‌గా చేసిన మిథున్ వరద రాజ కృష్ణన్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, స్టూడియో గ్రీన్ పతాకంపై కేజీ జ్ఞానవేల్ రాజా ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి ఆనంద్ తల్లిదండ్రులు గోవర్ధన్ దేవరకొండ, మాధవి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో హీరోయిన్లపై దర్శకుడు హరీష్ శంకర్ క్లాప్ ఇచ్చారు. తొలి సీన్‌కి దర్శకుడు చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శక-నిర్మాత సాయిరాజేష్, నిర్మాత జ్ఞానవేల్ రాజా, ఈ చిత్ర సహ-నిర్మాత 'మధుర' శ్రీధర్ స్క్రిప్ట్‌ను దర్శకుడు మిథున్‌కు అందజేశారు. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ– ''డ్యూయెట్' నాకు స్పెషల్ ఫిల్మ్. మిథున్ మంచి కథ రాశాడు'' అన్నారు. ''ఇదొక మంచి లవ్‌స్టోరీ'' అన్నారు మిథున్. ''ఈ కథ విన్నప్పుడు భావోద్వేగానికి లోనయ్యాను. జీవీ ప్రకాశ్‌కుమార్ ఆల్రెడీ రెండు పాటలు ఇచ్చేశారు. వారం రోజుల్లో తొలి షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు. ఈ వేడుకకు హీరోలు విజయ్ దేవరకొండ, సత్యదేవ్ అతిథులుగా హాజరయ్యారు.



● రితిక, ఆనంద్ దేవరకొండ

ఈ సినిమా నాకో పెద్ద వేడుక

- 'సత్యం' రాజేశ్



'సత్యం' రాజేష్, కామాక్షీ భాస్కర్ల ప్రధాన తారాగణంగా, రాకేందు మౌళి, బాలాదిత్య, కరుణకుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. 2021లో వీక్షకుల ముందుకు వచ్చిన 'మా ఊరి పొలిమేర'కు ఇది సీక్వెల్ చిత్రం. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రాన్ని పంపిణీదారుడు వంశీ నందిపాటి నేడు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో 'సత్యం' రాజేశ్ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర'కు వీక్షకుల నుంచి వచ్చిన స్పందనను బట్టి 'మా ఊరి పొలిమేర 2' చేద్దామని అనుకున్నాం. తొలి భాగం ముగిసిన దగ్గర్నుంచే మలి భాగం ఆరంభమవుతుంది. కొమరయ్య (సినిమాలో 'సత్యం' రాజేశ్ పాత్ర) గురించి నిజాలు తెలుసుకున్న లక్ష్మి (కామాక్షీ పాత్ర) ఏం చేసింది? ఏ విధంగా పగ తీర్చుకోవాలనుకుంది? కవిత ఎలా జీవించి ఉంది? ఇలాంటి ఆసక్తికరమైన కథనంతో మంచి ట్విస్ట్‌లతో సాగుతుంది. నా కెరీర్‌లో ఓ పెద్ద వేడుకలా ఈ సినిమాను భావిస్తున్నాను. ప్రస్తుతం 'గీతాంజలి' సీక్వెల్, వరుణ్‌తేజ్ 'మట్కా' వంటి సినిమాల్లో కీలక పాత్రలు చేస్తున్నాను. హీరోగా 'టెనెంట్' చేస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు.

''చేసిన పాత్రలనే మళ్లీ చేస్తే నాకు బోరింగ్‌గా అనిపిస్తుంటుంది. ఎప్పటికప్పుడు వినూత్నంగా, ప్రయోగాత్మకంగా సినిమాలు చేసే కార్తీనే ప్రేక్షకులు కూడా ఇష్టపడుతున్నారు. అంటే నేను నాలా ఉంటే ఆదరిస్తున్నారు. మరొకరిలా ఉండాలనుకోవడం లేదు. కాబట్టి నా తరహా సినిమాలే నేను చేస్తాను'' అని కార్తీ అన్నారు. కార్తీ హీరోగా 'జోకర్' ఫేమ్ రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన 'జపాన్' చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. తెలుగు వెర్షన్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో కార్తీ చెప్పిన విశేషాలు.


అలాంటి కార్తీనే ఇష్టపడుతున్నారు!

- హీరో కార్తీ



● 'జపాన్' క్యారెక్టర్ బేస్డ్ ఫిల్మ్. నిజమైన కథ కాదు. కొన్ని వాస్తవ ఘటనల స్ఫూర్తితో ఈ సినిమాను రూపొందించాం. ఈ సినిమా కేవలం వినోదం ఇవ్వడం మాత్రమే కాదు... మన ఉనికిని, అస్థిత్వాన్ని ప్రశ్నించేలా కూడా ఉంటుంది. ప్రస్తుత సమాజాన్ని ప్రతిబింబించేలా ఉంటుంది. సోషల్ మీడియా అంశాన్ని కూడా టచ్ చేశాం. అలాగే మనకు 'జపాన్' అంటే హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబు దాడి గుర్తుకు రావచ్చు. ఆ దాడి తర్వాత జపాన్ దేశం మళ్లీ పుంజుకుని అత్యున్నత స్థాయికి ఎదిగింది. ఈ రిఫరెన్స్ 'జపాన్' పాత్రలో కూడా కనిపిస్తుంది. ● చాలా కాలం తర్వాత మాస్‌తో కూడిన స్ట్రాంగ్ అండ్ సెటైరికల్ రోల్ నాకు మళ్లీ 'జపాన్'తో వచ్చినట్లు అనిపించింది. 'జపాన్' గ్రే క్యారెక్టర్ కాదు.. డార్క్ అంతే. నా క్యారెక్టర్‌లో డార్క్ హ్యూమర్ ఉంటుంది. 'జపాన్' కోసం రెగ్యులర్ కార్తీలా ఉండకూడదని అనుకున్నాను. దర్శకుడు కూడా ఇదే కోరుకున్నారు. ఈ సినిమా కోసం కొత్తగా మేకోవర్ అయ్యాను. నా వాయిస్ మాడ్యులేషన్, హెయిర్ స్టయిల్ అన్నీ కొత్తగా అనిపిస్తాయి. ● నేను నటించిన 'ఊపిరి' సినిమా తమిళ వెర్షన్‌కు దర్శకులు రాజు మురుగన్ డైలాగ్స్ రాశారు. ఆయనలో మంచి హ్యూమర్ ఉందని ఆ సమయంలో అనిపించింది. కానీ రాజుగారు తీసిన 'కుకు', 'జోకర్' సినిమాల్లో ఇది అంతగా లేదు. సాధారణంగా నేను నా కోసం ఏవైనా కథలు ఉన్నాయా? అని ఎవర్నీ అడగలేదు. తొలిసారి రాజు మురుగన్‌ని అడిగాను. ఓ డార్క్ ఎమోషనల్ స్టోరీ చెప్పారు. నాకు అంతగా నచ్చలేదు. ఆ తర్వాత మరో కథలోని ఓ క్యారెక్టర్ నచ్చి, ఆ పాత్ర ఆధారంగా కథ రాయమన్నాను. అలా 'జపాన్' కథ మొదలైంది. రాజు మురుగన్‌గారు గతంలో జర్నలిస్ట్‌గా చేశారు. ఆయన తన జీవితంలో చూసిన కొన్ని ఘటనలను 'జపాన్'లో చూపించే ప్రయత్నం చేశారు. అలాగే నాగార్జునగారి అన్నపూర్ణ స్టూడియోస్‌తో అసోషియేట్ అవ్వడం ఆనందంగా ఉంది. ● దర్శకుడు నలన్‌కుమార్‌తో నేను చేస్తున్న సినిమా 70 శాతం షూటింగ్ పూర్తయింది. '96' ఫేమ్ ప్రేమ్‌కుమార్‌తో ఓ సినిమా చేయనున్నాను. అలాగే 'ఖైదీ 2', 'సర్దార్ 2' చిత్రాలు చేయాల్సి ఉంది.

ఓ కల ఆధారంగా..



● రోహిత్ నందా

రోహిత్ నందా, ఆనంది జంటగా శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్ ద్వయం దర్శకత్వం వహించిన చిత్రం 'విధి'. ఎస్. రంజిత్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో రోహిత్ నందా మాట్లాడుతూ– ''న్యూజిల్యాండ్‌లో చదువుకున్నాను. నటనపై ఆసక్తితో స్టేజ్ డ్రామాల్లో చేశాను. చిరంజీవిగారి స్ఫూర్తితో ఇండస్ట్రీకి వచ్చాను. ఇక 'విధి' సినిమా రా అండ్ రస్టిక్ ఫిల్మ్. రియల్ లైఫ్‌లోని నా క్యారెక్టర్‌కు విభిన్నమైన పాత్రను ఈ సినిమాలో చేశాను. అలాగే మా 'విధి' సినిమాను చూపులేనివారు కూడా ఓ యాప్ సాయంతో ఆస్వాదించవచ్చు. ఈ ఆలోచన నాదే. కొన్ని కొత్త కథలు వింటున్నాను'' అన్నారు. ''మా కుటుంబ సభ్యుల్లో ఒకరికి వచ్చిన ఓ కల ఆధారంగా 'విధి' సినిమా స్టోరీ లైన్‌ను డెవలప్ చేసి, కథ రెడీ చేసుకున్నాం. రోహిత్ బాగా చేశారు'' అన్నారు శ్రీనాథ్, శ్రీకాంత్.

బ్యూటిప్స్

వేకువ జామున చలి తొంగి చూస్తోంది. కిటికీలో నుంచి దొంగలా గదిలో దూరుతోంది. చల్లగా ఒంటికి హాయినిస్తుంది. కానీ చర్మాన్ని పెళుసుబారుస్తుంది కూడా. అందుకే ఆలస్యంగా చర్మసంరక్షణ మొదలవ్వాలి.

శీతాకాలానికి స్వాగతం

- రాత్రి పడుకునే ముందు ముఖాన్ని శుభ్రంగా కడిగి ఆరిన తర్వాత బాదం నూనె లేదా ఆలివ్ ఆయిల్ రాయాలి.
- గోరువెచ్చటి నీటిని దోసిట్లోకి తీసుకుని ముఖాన్ని నీటిలో మునిగేటట్లు ఉంచాలి. ఇది హాట్‌థెరపీ. రోజుకొకసారి ఉదయం స్నానం చేయడానికి ముందు కానీ రాత్రి పడుకునే ముందుకానీ చేయవచ్చు.
- ఒక కోడిగుడ్డు సొనలో, టీ స్పూన్ కమలారసం, టీ స్పూన్ ఆలివ్ ఆయిల్, నాలుగైదు చుక్కల పన్నీరు, అంతే మోతాదులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించి పదిహేను నిమిషాల తర్వాత కడిగేయాలి. ఇది పొడిచర్మానికి వేయాల్సిన ప్యాక్.
- బాగా మగ్గిన అరటిపండును మెత్తగా చిదిమి ముఖానికి, మెడకు పట్టించి పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో ముఖాన్ని కడగాలి. ఇది పొడిచర్మానికి మాయిశ్చరైజర్‌గా పని చేస్తుంది, మెడ నలుపు కూడా వదులుతుంది.



- పొడిచర్మాన్ని మృదువుగా మార్చడంలో గ్రేప్‌సీడ్ ఆయిల్ బాగా పని చేస్తుంది. ఆయిల్‌ను ఒంటికి రాసి మర్దన చేయాలి.
- ఫేస్‌ప్యాక్‌లకు బదులుగా స్వచ్ఛమైన ఆముదం ఒంటికి రాసి మర్దన చేసుకోవాలి. ఆముదం వల్ల చర్మం మృదువుగా మారడంతో పాటు అనేక చర్మ సమస్యలు కూడా తగ్గుతాయి.

ఫ్యాషన్



ఉంగరాల గొలుసులు

వేళ్లకి ఉంగరాలు, మెడలో గొలుసులు ధరించడం సాధారణమే! చేతులకు ఉంగరాలు.. చెయిన్లు, హ్యాండ్ కఫ్స్ ధరించడం ఇప్పుడు ట్రెండ్. ఇండోవెస్టన్, వెస్టన్ డ్రెస్సుల మీదకు ఈ ఉంగరాలు, చెయిన్ల వరసలు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. యువత వేగానికి, స్టయిల్‌కి అద్దంలా భాసిల్లుతున్నాయి.

బంగారు వరసలు

లైట్ వెయిట్ జ్యువెలరీలో భాగంగా హ్యాండ్ కఫ్స్, చెయిన్స్ డిజైనర్లను ఆధునికత వైపుగా పరుగులు తీయిస్తున్నాయి. ఆభరణాల డిజైనర్లు బంగారు లోహంతో వెస్టన్ స్టైల్ డిజైన్స్‌ను కొత్తగా మెరిపిస్తున్నారు.

వెండి వెలుగులు

తక్కువ ఖర్చు అనే జాబితాను ఈ తరం పక్కన పెట్టేస్తోంది. ఏ డిజైన్ తమకు మరింత అందాన్ని తీసుకువస్తుందో, నలుగురిలో గుర్తింపును సంపాదిస్తుందో దానినే ఇష్టపడుతోంది. అందుకే సిల్వర్ డిజైన్స్ మరింతగా యువత మదిని గెలుచుకుంటున్నాయి.

స్టీల్ మెరుపులు

స్ట్రీట్ అండ్ బోహో స్టైల్‌లో స్టీల్‌తో తయారైన ఆభరణాలను యువత ఎక్కువ ధరిస్తుంటుంది. క్యాజువల్ వేర్, పార్టీవేర్‌కీ నప్పే ఈ డిజైన్ వరసలు వందల రూపాయల నుంచి మార్కెట్‌లో లభిస్తున్నాయి.

పారా హుషార్

ఇలాంటి వాళ్లకి ఎలా బుద్ధి చెప్పాలి?

బెంగళూరులోని ప్రముఖ మాల్. ఒక పెద్దమనిషి చాలా సేపుగా దేనికో కాచుకుని ఉన్నాడు. ఒక మహిళను గమనించాడు. వెనుక నుంచి వచ్చి ఆమెను అసభ్యంగా తాకి జనంలో కలిసిపోయాడు. కాని ఇది ఎవరో రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టారు. బెంగళూరు పోలీసులు అతన్ని పట్టుకోవడానికి రంగంలో దిగారు. రద్దీ ప్రదేశాల్లో స్త్రీలను అసభ్యంగా తాకడం కొందరికి అలవాటు. వీరితో ఎలా అప్రమత్తంగా ఉండాలి? వీరు మన ఇంటి మగవారే అయితే ఏ విధంగా సంస్కరించాలి?

మొన్నటి ఆదివారం జరిగింది ఇది: బెంగళూరులోని ఒక భారీ మాల్‌లో తన కుటుంబంతో షాపింగ్ చేస్తున్న జయప్రకాష్ (30)కి అతని చెల్లెలు దూరంగా ఉన్న ఒక వ్యక్తిని చూపింది. అన్నయ్యా... అతను ఆడవాళ్లను తాకుతున్నాడు అని చెప్పింది. జయప్రకాష్ పెద్దగా పట్టించుకోలేదు కాని కాసేపు ఆ వ్యక్తినే గమనిస్తే అతడు ఉద్దేశపూర్వకంగా ఆడవాళ్లను తాకుతున్నాడని అర్థమైంది. మాల్ రద్దీగా ఉండటంతో అతడు తాకుతున్నా ఆడవాళ్లు ఏదో యాదృచ్ఛికంగా తగిలాడు అన్నట్టుగా ముందుకు కదిలిపోతున్నారు. జయప్రకాష్ వెంటనే తన కెమెరాతో ఆ వ్యక్తి చర్యను రికార్డు చేశాడు. మాల్ వారికి కంప్లయింట్ చేశాడు. అంతేకాదు, సోషల్ మీడియాలో పెట్టాడు. అంతే! ఆ వీడియో దావానలంలా వ్యాపించింది. మాల్ వాళ్లిచ్చిన కంప్లయింట్ ఆధారంగా ఐపిసి సెక్షన్ 354 కింద కేసు నమోదు చేసిన పోలీసులు అతణ్ణి సీసీ కెమెరాల ద్వారా గుర్తించి ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఆ వ్యక్తి బెంగళూరుకు చెందిన ఒక రిటైర్డ్ హెడ్‌మాస్టర్. 8 నెలల క్రితమే రిటైర్ అయ్యాడు. వీడియో వైరల్ కావడంతో పోలీసులు రావడం కంటే ముందే అతను కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి ఎటో వెళ్లిపోయాడు. అయినా పోలీసులు వెతుకుతున్నారు.

ఒక 'చిన్న దుశ్చర్య'- దారుణ ఫలితం: ఆడవాళ్లను పబ్లిక్ ప్లేసుల్లో అసభ్యంగా కొన్ని సెకన్లపాటు తాకడం పెద్ద తప్పేం కాదని మగవారనుకుంటారు. ఇది 'అత్యాచారం' కాదు కదా. బలవంతం చేయడం కాదు కదా... వారికి తెలిసే లోపల తాకి వెళ్లిపోతాం కదా అనుకుంటారు. కాని ఆ సెకన్ల చర్య కూడా స్త్రీలకు తెలుస్తుంది. వికారం కలిగిస్తుంది. ఇప్పుడు ఈ రిటైర్డ్ హెడ్‌మాస్టర్ చేసిన చర్య బయట పడటంతో అతని పరువు, మర్యాదలు గంగలో కలిశాయి. కన్నడ టీవీ చానెళ్లు అతడి ఫొటో పెట్టి బజారుకు ఈడ్చాయి. పోలీసు కేసు నిరూపితమైతే శిక్ష కూడా పడుతుంది. బహుశా అతనికి ఎదిగొచ్చిన పిల్లలు, కొడుకు, కోడలు, కూతురు... వీరంతా ఉంటే వారి కుటుంబాలు కూడా మాటలు పడాలి. ఇవన్నీ మగవారు ఎందుకు ఆలోచించరు?



మ్యాన్ టచింగ్: ఇలా ఆడవాళ్లను పబ్లిక్ ప్లేసుల్లో తాకడాన్ని 'మ్యాన్‌టచింగ్' అని కొందరు అంటారు. ఒక స్త్రీ శరీరం అందుబాటులోకి వస్తే దానిని తాకొచ్చనే గుంపులో గోవింద స్వభావం మగవాణ్ణి ఇందుకు ఉసిగొల్పుతుంది. లైంగిక అభద్రతలు కొందరిని ఇలా చేయడానికి ప్రేరేపిస్తే, లైంగిక ఉద్రేకం కోసం కొందరు ఇలా చేస్తారు. గమనించాల్సిందేమంటే ఈ మగవారంతా మిగతా సమయాల్లో 'పరువు, మర్యాద, మంచి ఉద్యోగం' ఉన్న వ్యక్తులే. అపరిచితులు, పరిచితులు కూడా ఇలా చేస్తారు. ఎవరూ గమనించకుండా శరీర భాగాలు తాకేవారు కొందరైతే, వేదికల మీద పెళ్లిళ్ల, శుభకార్యాలలో పెద్దరికం వహిస్తూ బుగ్గలు పుణకడం, భుజాల చుట్టూ చేతులు వేసి దగ్గరకు తీసుకోవడం మరికొందరు చేస్తారు. ఇవన్నీ స్త్రీల అనుమతి లేకుండా వారిని తాకడంగానే భావించాలి.

మగవాళ్లు దొంగసాకులు: 1. కొంచెములా రాసుకుంటే ఏమవుతుంది అనుకోవడం... ఆమె మరీ రెచ్చగొట్టేలా ఉంది అనడం. 2. ఆమె నన్ను రెచ్చగొట్టి తాకేలా చేసింది అనడం 3. పరిచయం ఉన్న ఆమేగా... ఏమనుకుంటుందిలే అనుకోవడం 4. ఆమె పట్ల నా ఇష్టాన్ని తెలిపేందుకు అనడం... ఇలా ఏం చెప్పినా ఒక స్త్రీని ఆమె అనుమతి లేకుండా ఎక్కడా తాకకూడదు.

నిలువరించాలి: స్త్రీలు బహిరంగ ప్రదేశాలలో 'ఎందుకులే రచ్చ' అనుకోకుండా ఇలా అసభ్యంగా తాకే వారిని వెంటనే నిలువరించాలి. చూపు ద్వారా, మాట ద్వారా వీరిని ఒక్క క్షణంలో నిలువరించవచ్చు. సాయం తీసుకుని పోలీసులకు పట్టివ్వొచ్చు. పరిచితులు అస్తమానం తాకుతూ ఉన్నా వారికి మొహమాటం లేకుండా తాకొద్దని చెప్పేయాలి. ముఖ్యంగా పిల్లలకు పబ్లిక్ ప్లేసుల్లో ఎవరినీ తాకనీకుండా చూసుకోవాలని హెచ్చరించాలి.

మన ఇంటి మగవారు: పై కేసులోని రిటైర్డ్ హెడ్‌మాస్టర్‌కు కూడా ఒక ఇల్లు ఉంటుంది. ఇలా ఆడవాళ్లను తాకాలని చూసే మగవారు ఏ ఇంటిలో అయినా ఉండొచ్చు. ఇంటి ఆడవాళ్లు మాటల్లో మాటగా ఎవరైనా పబ్లిక్ ప్లేసుల్లో తమను తాకితే ఎంత కంపరంగా ఉంటుందో చెబుతుండాలి. అలా చేసిన వారిని పబ్లిక్‌గా పట్టుకొని దండిస్తే ఎంత అవమానంగా ఉంటుందో చెప్పాలి. స్త్రీలను గౌరవించి వారికి అసౌకర్యం కలిగించే ఏ పనీ చేయరాదని తప్పక చెప్పాలి. అలాగే సామాజిక ఆరోగ్యం కోసం మగవారు తమ చపలత్వాన్ని నివారించుకోవడం తప్పక అభ్యాసం చేయాలి- దొరికి దెబ్బలు తినడం కంటే అదే మేలు.

పురస్కారం

షేక్‌స్పియరే తన పవర్

'ఏ యుద్ధం ఎందుకు జరిగెనో? ఏ రాజ్యం ఎన్నాళ్లుందో?

తారీఖులు, దస్తావేజులు... ఇవి కావోయ్ చరిత్రకర్థం'... మహాకవి మాట తిరుగులేని సత్యం అయినప్పటికీ కొన్నిసార్లు యుద్ధాలు, తారీఖులు, ప్రేమ పురాణాలు, ముట్టడికైన ఖర్చులు... చారిత్రక పరిశోధనకు అవసరం. ఏ సమాచారమూ వృథా పోదు.

వర్తమానంలో ఉండి ఆనాటి మొగల్, బ్రిటిష్ ఇండియాలోకి వెళ్లడం అంత తేలిక కాదు.


అలుపెరగని పరిశోధన కావాలి. అంతకుముందు కనిపించని ప్రత్యేక వెలుగు ఏదో ఆ పరిశోధనలో ప్రతిఫలించాలి.

అందమైన శైలికి అద్భుతమైన పరిశోధన తోడైతే...అదే 'కోర్టింగ్ ఇండియా' పుస్తకం.

ప్రొఫెసర్ నందిని దాస్ రాసిన 'కోర్టింగ్ ఇండియా: ఇంగ్లాండ్, మొఘల్ ఇండియా అండ్ ది ఆరిజిన్స్ ఆఫ్ ఎంపైర్' పుస్తకం ప్రతిష్ఠాత్మకమైన బ్రిటిష్ అకాడమీ బుక్ ప్రైజ్-2023 గెలుచుకుంది...



● నందిని దాస్



ఇంట్లో, తరగతి గదిలో, పుస్తకాల్లో, టీవీల్లో విన్న కథల ద్వారా నందిని దాస్‌కు షేక్‌స్పియర్ ఇష్టమైన రచయితగా మారాడు. ఆ మహా రచయితపై ఇష్టం ఆంగ్ల సాహిత్యంపై ఇష్టంగా మారింది. ఆయన పుస్తకాలు తన మనోఫలకంపై ముద్రించుకుపోయాయి.

అలనాటి ప్రయాణ సాహిత్యం నుంచి భిన్న సంస్కృతుల మధ్య వైరుధ్యాల వరకు నందినికి ఎన్నో అంశాలు ఆసక్తికరంగా మారాయి. పరిశోధిస్తూ, రాసే క్రమంలో తన మానసిక ప్రపంచం విశాలం అవుతూ వచ్చింది.

యూనివర్శిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌లో నందిని దాస్ ప్రొఫెసర్. షేక్‌స్పియర్ సాహిత్యం ఆమెకు కొట్టిన పిండి. ఆమె పేరు పక్కన కనిపించే విశేషణం...'స్పెషలిస్ట్ ఇన్ షేక్‌స్పియర్ స్టడీస్'

కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్శిటీలో బీఏ ఇంగ్లీష్ చేసింది నందిని. ఆ తరువాత స్కాలర్‌షిప్‌పై యూనివర్శిటీ కాలేజి, ఆక్స్‌ఫర్డ్‌లో చేరింది. కేంబ్రిడ్జ్, ట్రినిటీ కాలేజిలో ఎంఫిల్, పీహెచ్‌డీ చేసింది. ఒక ప్రచురణ సంస్థలో సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్‌గా పని చేసిన నందిని సంవత్సరం తరువాత మళ్లీ అకాడమిక్ రిసెర్చ్‌లోకి వచ్చింది.

ఇక తాజా విషయానికి వస్తే...

'ది పవర్ ఆఫ్ గుడ్ రైటింగ్'గా విశ్లేషకులు కీర్తించిన 'కోర్టింగ్ ఇండియా' యూరోపియన్‌ల హింసా ధోరణి గురించి చెప్పింది. రాయబార కార్యాలయాల అసమర్థతను ఎత్తి చూపింది. మొఘల్ రాజకీయాలను ఆవిష్కరించింది.

' ఆనాటి బ్రిటన్, ఇండియాలకు సంబంధించి వాస్తవిక చిత్రాన్ని ఆవిష్కరించింది నందిని. మొగల్ రాజుల ఒడిదొడుకుల నుంచి బ్రిటీష్ వైఖరి వరకు ఈ పుస్తకంలో ఎన్నో కనిపిస్తాయి' అంటాడు బ్రిటీష్ అకాడమీ బుక్‌ప్రైజ్- ఛైర్ ఆఫ్ ది జ్యూరీ ప్రొఫెసర్ చార్లెస్ ట్రిప్.

వంటిల్లు

చలి కొరుకుడుని తట్టుకోవాలంటే నోటికి కాస్త వేడివేడి రుచులు తగలాల్సిందే. వేడితోపాటు కారం, కరకర లాడే కమ్మదనం తోడయితే చలిని కూడా కొరికేయవచ్చని చెబుతోంది ఈ వారం వంటిల్లు.

చలిని వెచ్చగా కొరికేద్దాం!



పొటాటో పాన్‌కేక్స్

కావలసినవి: ఉడికించి చిదుముకున్న బంగాళ దుంపలు – రెండు కప్పులు; గుడ్డు – ఒకటి; మైదా – ముప్పావు కప్పు; స్ప్రింగ్ ఆనియన్ తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; చీజ్ తరుగు – కప్పు; క్యారట్ తురుము – అర కప్పు; ఉప్పు – రుచికి సరిపడా; మిరియాల పొడి – రెండు టీస్పూన్లు; నూనె – అరకప్పు; పుల్లటి పెరుగు – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● గిన్నెలో చిదిమిన దుంపల మిశ్రమం, గుడ్డుసొన, మైదా, స్ప్రింగ్ ఆనియన్, చీజ్ తరుగు, మిరియాలపొడి, రుచికి సరిపడా ఉప్పువేసి కలపాలి ● ఈ మిశ్రమం చేతులకు అంటుకుంటున్నట్లు అయితే మరో టేబుల్ స్పూను మైదా వేసి కలపాలి ● పిండి ముద్దను ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండిని చిన్నచిన్న ముద్దలుగా చేసి పాన్‌కేక్‌లా వత్తుకోవాలి ● బాణలిలో నూనె వేయాలి. బాగా కాగిన నూనెలో ఒక్కో పాన్‌కేక్‌ను వేసి మీడియం మంట మీద కాల్చాలి ● క్రిస్పీగా బ్రౌన్ కలర్‌లోకి మారాక పాన్‌కేక్‌లను తీసేయాలి ● పాన్‌కేక్ పైన కొద్దిగా పుల్లటి పెరుగువేసి సర్వ్ చేసుకోవాలి.



పోహా వెజ్ కట్‌లెట్

కావలసినవి: అటుకులు – కప్పు; ఉడికించిన బంగాళ దుంపలు – రెండు; క్యాప్సికం తరుగు – రెండు టీస్పూన్లు; క్యారట్ తురుము – రెండు టీస్పూన్లు; పచ్చిబఠాణీ – రెండు టేబుల్ స్పూన్లు; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; ధనియాల పొడి – టీస్పూను; చాట్ మసాలా – టీస్పూను; కారం – టీస్పూను; పచ్చిమిర్చి పేస్టు – టీస్పూను; కార్న్‌ఫ్లోర్ – రెండు టేబుల్ స్పూన్లు; బ్రెడ్ ముక్కల పొడి – కప్పు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● అటుకులను శుభ్రంగా కడిగి పదినిమిషాలు నానబెట్టుకోవాలి ● పదినిమిషాల తరువాత నానిన అటుకుల్లో తొక్కతీసిన దుంపలు, బఠాణీ, క్యాప్సికం, క్యారట్, కొత్తిమీర తరుగు వేయాలి ● పచ్చిమిర్చి పేస్టు, చాట్ మసాలా, ధనియాల పొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి ముద్దలా కలపాలి ● పిండిని ఉండలుగా చేసి, కట్‌లెట్‌లా వత్తుకుని పక్కన పెట్టుకోవాలి ● కార్న్‌ఫ్లోర్‌లో నీళ్లు పోసి పేస్టులా కలపాలి ● ఒక్కో కట్‌లెట్‌ను కార్న్‌ఫ్లోర్ పేస్టులో ముంచి, తరువాత బ్రెడ్ ముక్కల పొడిని అద్దాలి ● బ్రెడ్ ముక్కల పొడి అద్దిన తరువాత డీప్ ఫ్రై చేసుకోవాలి ● గోల్డెన్ కలర్‌లోకి మారాక తీసి సాస్ లేదా గ్రీన్ చట్నీతో సర్వ్ చేయాలి.



పనీర్ కుర్‌కురే

కావలసినవి: నిలువుగా కోసిన పనీర్ ముక్కలు – రెండు కప్పులు; పసుపు – టీస్పూను; కారం – టీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; కసూరీ మేథీ – టేబుల్ స్పూన్; వాము – అరటీస్పూను; చాట్ మసాలా – టీస్పూను; గరం మసాలా – టీస్పూను; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; అల్లం వెల్లుల్లి పేస్టు – టేబుల్ స్పూను; కార్న్‌ఫ్లేక్స్ – రెండు కప్పులు; శనగపిండి – రెండు కప్పులు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● పనీర్ ముక్కలపైన చిటికెడు సాల్ట్, కారం, టేబుల్ స్పూను కొత్తిమీర తరుగు, చాట్ మసాలా వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి ● పెద్ద గిన్నె తీసుకుని శనగపిండి, వాము, అల్లం వెల్లుల్లి పేస్టు, కసూరీ మేథీ, గరం మసాలా, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● ఇప్పుడు నీళ్లు పోసి బజ్జీపిండిలా కలుపుకొని పక్కన పెట్టుకోవాలి ● ఒక ప్లేటులో కార్న్ ఫ్లేక్స్‌ను నలిపి పెట్టుకోవాలి ● ఇప్పుడు ఒక్కో పనీర్ ముక్కను తీసుకుని ముందుగా శనగపిండి మిశ్రమంలో ముంచాలి. తరువాత కార్న్‌ఫ్లేక్స్‌ను అద్ది సలసలా కాగుతోన్న నూనెలో వేసి డీప్‌ఫ్రై చేయాలి ● పనీర్ ముక్క క్రిస్పీగా మారితే పన్నీర్ కుర్‌కురే రెడీ.



పాలక్ మేథీ పూరీ

కావలసినవి: జీలకర్ర – టేబుల్ స్పూను; సోంపు – టేబుల్ స్పూను; వాము – టీస్పూను; నువ్వులు – టేబుల్ స్పూను; ధనియాల పొడి – టేబుల్ స్పూను; పచ్చిమిర్చి – మూడు; అల్లం తరుగు – టీస్పూను; కరివేపాకు – రెండు రెమ్మలు; పాలకూర తరుగు – రెండు కప్పులు; మెంతికూర తరుగు – కప్పు; గోధుమ పిండి – రెండు కప్పులు; శనగపిండి – పావు కప్పు; పసుపు – అరటేబుల్ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా; కారం – టేబుల్ స్పూను; నూనె –డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● జీలకర్ర, సోంపు, నువ్వులు, వాము, ధనియాల పొడి, పచ్చిమిర్చి; అల్లం తరుగు, కరివేపాకుని మిక్సీజార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి ● పాలకూర, మెంతికూర తరుగుని గిన్నెలో వేయాలి. దీనిలోనే గోధుమపిండి, శనగపిండి, కారం, పసుపు, గ్రైండ్ చేసిన మసాలా పొడి, రుచికి సరిపడా ఉప్పు, టేబుల్ స్పూను నూనె వేసి కలపాలి ● ఈ మిశ్రమంలో కొద్ది కొద్దిగా వేడినీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలపాలి ● పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసి పూరీలా మందంగా వత్తుకోవాలి ● గుండ్రని గిన్నె లేదా చిన్న గ్లాసుతో పూరీని చిన్న చిన్న చెక్కల్లా కట్ చేయాలి ● అన్నీ రెడీ అయ్యాక క్రిస్పీగా మారేంత వరకు డీప్ ఫ్రై చేస్తే రుచికరమైన పాలక్ మేథీ పూరీ రెడీ.